
# శుభోదయం


ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 31, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) ఆదివారం - 20 - ఏప్రిల్ - 2025


## మే 1 నుంచి టోల్ ప్లాజా కొత్త రూల్స్




న్యూఢిల్లీ : భారత రవాణా రంగంలో మరో ముఖ్యమైన మార్పు రాబోతున్నది. భారత్ లో శాటిలైట్ ఆధారిత టోల్ సిస్టమ్ అమలులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ విధానం ప్రస్తుతం ఉన్న టోల్ ప్లాజాల వద్ద ఆగకుండా, వాహనం కదులుతున్నప్పుడే టోల్ రుసుమును వసూలు చేసేందుకు ఉపయోగపడుతుంది.

## యుద్ధం ముగించకపోతే అమెరికా మారే దారి

ఉక్రెయిన్ యుద్ధం ముగించకుంటే యుక్రెయిన్‌పై అమెరికా దారి మళ్లింపు.



న్యూఢిల్లీ : రష్యా యుద్ధానికి ముగింపు తెచ్చేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలకు ఇక సమయం తక్కువగా మిగిలిందని, త్వరలోనే తమ దారి తాము చూసుకుంటామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. శుక్రవారం యూరోపియన్, ఉక్రెయిన్ నేతలతో జరిగిన సమావేశం మిగతా.. 2లో

## బంగ్లాదేశ్‌లో హిందూ నేత హత్యపై తీవ్రంగా స్పందించిన భారత్




- దివాజ్‌పుర్‌కు చెందిన భబేష్ చంద్ర రాయ్ కిడ్నాప్, హత్య
- ఈ హత్య తమను ఎంతగానో కలిచివేసిందన్న భారత్
- మైనార్టీలను రక్షించే బాధ్యత తాత్కాలిక ప్రభుత్వంపై ఉందన్న భారత్



## కెనడాలో గ్యాంగ్ వార్..
### బుల్లెట్ తగిలి భారత విద్యార్థిని మృతి

- హామిల్టన్ లో పరస్పరం కాల్పులు జరుపుకున్న వాహనదారులు
- బుల్లెట్ మిస్ ఫైర్.. బస్టాప్ లో వెయిట్ చేస్తున్న యువతికి గాయాలు
- ఆసుపత్రికి తరలించే లోపే చనిపోయిన యువతి
- కుటుంబానికి అండగా ఉంటామని భారత కాన్సులేట్ వెల్లడి



# మీ ఆలోచనలను ప్రభుత్వంతో పంచుకోండి..

### జపాన్ తెలుగు సమాఖ్య కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

జపాన్ పర్యటనలో సీఎం నాలుగో రోజు పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా టోక్యోలు ఏర్పాటు చేసిన తెలుగు సమాఖ్య కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మూసీ నది ప్రక్షాళన విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్నాయని మండిపడ్డారు. "గుజరాత్‌లో మోడీ సబర్మతి రివర్ ఫ్రంట్ కట్టుకుంటే, ప్రయాగరాజ్‌లో గంగానది ఒడ్డున రివర్ ఫ్రంట్ ఉంటే, మరి తెలంగాణలో మూసీ ప్రక్షాళన ఎందుకు కాకూడదు?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

హైదరాబాద్ : తెలంగాణ అభివృద్ధికి అందరి సహకారం అవసరం అని.. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యా నించారు. జపాన్ తెలుగు సమాఖ్య నిర్వహించిన కార్య క్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. సొంత ప్రాంతాన్ని డెవలప్ చేసేందుకు ముందుకు రావాలని ఆహ్వా నించారు. సమావేశంలో మాట్లా డుతున్న సీఎం రేవంత్ తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని.. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వివ రించారు. జపాన్ పర్యటనలో సీఎం.. అక్కడి తెలుగు సమాఖ్య నిర్వ హించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధిలో అందరి సహ కారం అవసరం అని ఉద్ఘాటించారు.

- మూసి పునరుజ్జీవం చేస్తామంటే.. బీజేపీ, బీఆర్ఎస్ అడ్డుకుంటోంది
- ఈ క్రమంలో జపాన్ లో ఉన్న తెలంగాణ వాసులతో సమావేశమయ్యారు.
- ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నాం..
- తెలంగాణ అభివృద్ధికి అందరూ సహకరించాలి
- రాబోయే రోజుల్లో డ్రై పోర్ట్ ఏర్పాటుతో మరింత అభివృద్ధి చెందుతుంది
- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్నాయి

అందరి అలోచనలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులను తీసుకొచ్చేందుకు సీఎం రేవంత్ కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో జపాన్ లో ఉన్న తెలంగాణ వాసులతో సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. మిగతా.. 2లో

## ఎమ్మెల్సీ ఎన్నికల వేళ కేడర్ కు కేటీఆర్ కీలక పిలుపు..!!



హైదరాబాద్ : ఎమ్మెల్సీ ఎన్నికల వేళ కేటీఆర్ కీలక ప్రకటన చేసారు కేడర్ కు స్పష్టత ఇచ్చారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం గురించి దిశా నిర్దేశం చేసారు. ముఖ్యమంత్రి రేవంత్ తీరును తప్పు బట్టారు. సీఎం రేవంత్ రెడ్డి పిచ్చి పనులతో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో అసహ్యం పెరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు మిగతా.. 2లో



## బెంగాల్ లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్ లో రాష్ట్రపతి పాలన విధించాలని సీనియర్ యాక్టర్, బీజేపీ నేత మిథున్ చక్రవర్తి డిమాండ్ చేశారు. ముర్షిదాబాద్ హింసపై బెంగాల్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బెంగాల్‌లో శాంతి భద్రతలు ఘోరంగా దెబ్బ తిన్నాయని, ప్రభుత్వం విఫలమైంది కాబట్టే రాష్ట్రపతి పాలన విధించాల్సిన మిగతా.. 2లో

## ధరణితో దందాలు చేశారు.. అలాంటి వాటికి భూ భారతిలో చోటు లేదు..



- గత పదేళ్లుగా ఆక్రమించిన భూ భాగోతం మొత్తం బయటకొస్తుందనే భయం వారికి పట్టుకుంది
- భూ భారతిలో వాళ్ల ఆగడాలు బయటకు వస్తాయనే అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారు
- పేదల హక్కులు తీసేసి బడా బాబులకు అనుకూలంగా వాడుకున్నారు

హైదరాబాద్ : : ఆదిలాబాద్ జిల్లాలో భూ భారతి చట్టంపై అవగాహన కార్య క్రమంలో మంత్రి సీతక్క పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధరణితో దందాలు చేశారు.. మిగతా.. 2లో


## మోదీ ప్రతిపాదనకు ఒప్పుకొన్న మస్క్- గేమ్ ఛేంజ్



న్యూఢిల్లీ : ప్రఖ్యాత ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ అధినేత, అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ చీఫ్ ఎలాన్ మస్క్.. భారత్‌లో అడుగుపెట్టబోతున్నారు.

కంద్ర ప్రభుత్వం ఆయనకు రెడ్ కార్పెట్ స్వాగతం పలకడం ఖాయంగా కనిపిస్తోంది. కీలక రంగాల్లో ఆయన భాగస్వామ్యాన్ని కేంద్రం కోరుకుంటోండటమే దీనికి ప్రధాన కారణం. ఈ విషయంపై ఎలాన్ మస్క్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా మాట్లాడారు.

## జిల్లాకు ఒక సైబర్ క్రైం పోలీస్ స్టేషన్..!



అమరావతి : : కొత్తగా పది పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఉన్నాయి.. జిల్లాకు ఒక సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తాం అన్నారు ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత.. గుంటూరు రేంజ్ పరిధిలో మిగతా.. 2లో

# విశాఖ మేయర్ పీఠం కూటమి కైవసం

### జీవీఎంసీ వైసీపీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై కూటమి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది

### వైసీపీకి భారీ షాక్...

- మేయర్ పై పెట్టిన అవిశ్వాసంలో కూటమి ఘన విజయం
- మేయర్ పదవిని కోల్పోయిన వైసీపీ
- జీవీఎంసీ కార్యాలయం వద్ద కూటమి నేతల సంబరాలు
- ఓటింగ్‌లో 74 మంది సభ్యుల బలంతో కూటమి విజయం సాధించింది
- మరోవైపు.. ప్రతిపక్ష వైసీపీ సభ్యులు కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించారు




అమరావతి : వైసీపీకి మరో భారీ షాక్ తగిలింది. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ను వైసీపీ కోల్పోయింది. జీవీఎంసీ వైసీపీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై కూటమి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. విశాఖ మేయర్ పీఠం కూటమి వశమయింది. ఈ ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ఇన్చార్జ్ కమిషనర్, కలెక్టర్ హరేంధిరప్రసాద్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ప్రారంభమయింది. ఇప్పటికే వైసీపీ కార్పొరేటర్లు ఒక్కొక్కరుగా మిగతా.. 2లో

## కర్ణాటక నుంచి రాజ్యసభకు వైఎస్ షర్మిల!



అమరావతి : ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలకు త్వరలో పదవీయోగం పట్టనుందని ప్రచారం జరుగుతోంది. కర్ణాటక నుంచి కాంగ్రెస్ తరఫున ఆమెను రాజ్యసభకు పంపాలని ఆ పార్టీ హైకమాండ్ డిసైడ్ అయినట్లు చెబు తున్నారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీని విస్తరిం చడంతోపాటు కర్ణాటకలోనూ మిగతా.. 2లో

## జగన్ తో మనస్పర్థలు రావడానికి తొలి కారణం ఇదే: రఘురామకృష్ణరాజు



- కోడెల పట్ల వైసీపీ నేతలు చులకనగా మాట్లాడేవారన్న రఘురామ
- తాను విభేదించడంతో జగన్ తో మనస్పర్థలు వచ్చాయని వెల్లడి
- రాజకీయాల్లోకి వస్తానని కలలో కూడా ఊహించలేదన్న రఘురామ

## కీలక నిర్ణయాలకు సిద్ధమైన జగన్ - 22, 23 తేదీల్లో ప్రకటనలు..!

- సొంత పార్టీ నేతలకు భవిష్యత్ రాజకీయంపై దిశానిర్దేశం చేసేందుకు జగన్ సిద్ధమవుతున్నారు.
- ఇందుకోసం రెండు కీలక భేటీలు నిర్వహించబోతున్నారు



అమరావతి : ఏపీలో గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో చిత్తుగా ఓటమిపాలైన తర్వాత భవిష్యత్ రాజకీయంపై జగన్ పూర్తిస్థాయిలో మేథోమథనం చేయలేదు. అదే సమయంలో కూటమి సర్కార్ పాత కేసులతో వైసీపీ నేతల్ని తరుముతుతోంది. అటు కేంద్రంలో ఎన్డీయే సర్కార్ కు అండగా నిలవాలా మిగతా.. 2లో

శుభోదయం
ఆదివారం - 20 - ఏప్రిల్ - 2025

## మే 1 నుంచి టోల్ ప్లాజా కొత్త రూల్స్

మొదటి పేజి తరువాయి

వాహనాల్లో గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జిపిఎస్) లేదా గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (జిఎన్ఎస్-ఎస్) వంటి ఉపగ్రహ ఆధారిత సాంకేతికతను ఉపయోగిస్తారు. కొన్నిసార్లు దీనితో పాటు ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలు కూడా ఉపయోగించవచ్చు.వాహనం యొక్క కదలికలను ప్రయాణించిన దూరాన్ని శాటిలైట్ ద్వారా గుర్తించి, ఆ సమాచారాన్ని కేంద్రీకృత సర్వర్‌కు పంపుతారు. ప్రయాణించిన దూరం మరియు రహదారి రకం ఆధారంగా టోల్ రుసుమును లెక్కిస్తారు.టోల్ రుసుము వాహన యజమాని యొక్క అనుసంధానించబడిన ఖాతా (బ్యాంక్ ఖాతా లేదా ప్రీపెయిడ్ వాలెట్) నుండి ఆటోమేటిక్‌గా డెబిట్ అవుతుంది.

ఆధారిత సాంకేతికత

చెల్లింపు చేయడంలో విఫలమైతే ఫాస్ట్‌ట్యాగ్ సస్పెండ్ చేయబడవచ్చు ఇతర వాహన సంబంధిత జరిమానాలు విధించబడవచ్చు. ఎంపిక చేసిన టోల్ ప్లాజాలలో ఈ వ్యవస్థ పనితీరు, సామర్థ్యం వినియోగదారుల స్పందన ఆధారంగా దేశవ్యాప్తంగా అమలు చేసే విషయంపై నిర్ణయం తీసుకుంటారు. మే 1 నుండి కొత్త సాంకేతికతను కొన్ని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నారు. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా టోల్ వసూలు విధానంలో మార్పులు ఉండవచ్చు.ఈ విధానంలో వాహనాల్లో గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జి పిఎస్) లేదా గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (జిఎన్ఎస్ఎస్) వంటి ఉపగ్రహ ఆధారిత సాంకేతికతను ఉపయోగిస్తారు. కొన్నిసార్లు దీనితో పాటు ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలు కూడా ఉపయోగించవచ్చు.వాహనం యొక్క కదలికలను మరియు ప్రయాణించిన దూరాన్ని శాటిలైట్ ద్వారా గుర్తించి, ఆ సమాచారాన్ని కేంద్రీకృత సర్వర్‌కు పంపుతారు. ప్రయాణించిన దూరం రహదారి ఆధారంగా టోల్ రుసుమును లెక్కిస్తారు.టోల్ రుసుము వాహన యజమాని యొక్క అనుసంధానించబడిన ఖాతా (బ్యాంక్ ఖాతా లేదా ప్రీపెయిడ్ వాలెట్) నుండి ఆటోమేటిక్‌గా డెబిట్ అవుతుంది.

నితిన్ గడ్కరీ స్పందన

టోల్ ప్లాజాలు ఉండవు కాబట్టి ట్రాఫిక్ జామ్‌లు గణనీయంగా తగ్గుతాయి.వాహనదారులు ఆగకుండా ప్రయాణించవచ్చు కాబట్టి సమయం ఇంధనం ఆదా అవుతుంది. టోల్ ప్లాజాల నిర్వహణ సిబ్బంది ఖర్చులు తగ్గుతాయి. టోల్ వసూలు మరింత సమర్థవంతంగా జరుగుతుంది.ప్రయాణించిన దూరం మేరకు మాత్రమే రుసుము చెల్లించే అవకాశం ఉంటుంది. శాటిలైట్ ఆధారిత టోల్ సిస్టమ్‌పై కేంద్ర రోడ్డు రవాణా రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. శాటిలైట్ ఆధారిత టోల్ వసూలు వ్యవస్థను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ వ్యవస్థ యొక్క ముఖ్య ఉద్దేశ్యం టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించడం,టోల్ వసూలును మరింత సమర్థవంతంగా చేయడమే అని ఆయన తెలిపారు. మరో 15 రోజుల్లో శాటిలైట్ ఆధారిత టోల్ సిస్టమ్ కార్యచరణను మొదలుపెట్టే అవకాశం కనిపిస్తోంది.

## యుద్ధం ముగించకపోతే అమెరికా మారే దారి

మొదటి పేజి తరువాయి

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలు ప్యారిస్‌లో చర్చల్లో కీలక మలుపుని సూచిస్తున్నాయి.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ యుద్ధానికి ముగింపు పలికేందుకు వారాలు, నెలల తరబడి అత్యున్నత స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారని రూబియో వివరించారు. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో శాంతి చర్చలు నిరర్థకంగా మారుతున్నాయని, ఇది కొనసాగితే ట్రంప్ తదుపరి చర్యలు తీసుకుంటారని ఆయన సూచించారు. శాంతి కుదిర్చేందుకు ట్రంప్ ఆసక్తిగా ఉన్నప్పటికీ, ఆయనకు ప్రపంచవ్యాప్తంగా ఇతర ప్రాధాన్యతలు కూడా ఉన్నాయని రూబియో పేర్కొన్నారు.

చర్చలకు గడువు ముగిసిన దశలో

ఇక శాంతి చర్చలకు ఎక్కువ కాలం కేటాయించే అవకాశం లేదని స్పష్టం చేశారు. 'ఈ చర్చల్లో పురోగతి కనిపించకపోతే, ట్రంప్ దాన్ని వదిలేసి ముందడుగు వేస్తారు. ఇక నెలలు, వారాల పాటు ప్రయత్నించడం ఉండదు,' అని రూబియో పేర్కొన్నారు. ఉక్రెయిన్ శాంతి ఒప్పందం త్వరలోనే సాధ్యమవుతుందని ట్రంప్ గురువారం చేసిన వ్యాఖ్యలు ఈ నేపథ్యంలో మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.ట్రంప్ తాజాగా ఉక్రెయిన్‌తో ఖనిజాల ఒప్పందం కూడా చేసుకోవచ్చని ప్రకటించారు. ఇది అమెరికా వ్యూహంలో కొత్త మలుపు అని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ యుద్ధం కొనసాగితే, అమెరికా శాంతి చర్చల ప్రయత్నాలను నిలిపివేసి తన దారి తాను చూసుకుంటుందని మార్కో రూబియో చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీ యాంశంగా మారాయి.ఇప్పటి వరకూ అమెరికా శాంతి చర్చల్లో కృషి చేస్తూ వచ్చింది. అయితే, శాంతి ఒప్పం దాలు ముందుకు సాగకపోవడం, రష్యా వైఖరిలో మార్పు లేకపోవడం వంటివి అమెరికా కొత్త నిర్ణయాలకే దారి తీశాయి. అమెరికా ప్రజలు కూడా ఈ యుద్ధానికి ఆర్థికంగా మద్దతివ్వడం తప్పదన్న ఒత్తిడిలో ఉన్నారు. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకొని, ట్రంప్ ప్రభుత్వం తన నయమైన మార్గాన్ని మార్చుకునే అవకాశాలు ఉన్నాయి.

## బంగ్లాదేశ్‌లో హిందూ నేత హత్యపై తీవ్రంగా స్పందించిన భారత్

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్‌లో హిందూ నాయకుడు భబేష్ చంద్ర రాయ్ హత్యకు గురయ్యారు. దుండగులు ఆయనను కిడ్నాప్ చేసి, హత్య చేశారు. ఈ ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. భబేష్ చంద్ర రాయ్ కిడ్నాప్, హత్య తమ దృష్టికి వచ్చిందని, ఇది తమను ఎంతగానో కలిచివేసిందని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక ప్రభుత్వ పాలనలో హిందూ మైనార్టీలపై జరుగుతోన్న దాడుల్లో ఇది మరొక ఘటన అని పేర్కొన్నారు. గతంలో ఇలాంటి దాడులకు పాల్పడినవారు ఎలాంటి శిక్ష లేకుండా స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వివక్ష లేకుండా మైనార్టీలను రక్షించే బాధ్యత తాత్కాలిక ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. భబేష్ చంద్ర రాయ్ ఉత్తర బంగ్లాదేశ్‌లోని దివాజ్‌పుర్‌కు చెందిన హిందూ మైనార్టీ నేత. గురువారం సాయంత్రం ఆయనకు ఫోన్ కాల్ రాగా, తాను ఇంట్లోనే ఉన్నట్లు చెప్పారు. ఆ తర్వాత నలుగురు వ్యక్తులు ఇంటికి వచ్చి ఆయనను బలవంతంగా లాక్కెళ్లారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా, నరబరి గ్రామంలో తీవ్ర గాయాలతో కనిపించారు. ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించనట్లు వైద్యులు ధృవీకరించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల వేళ కేడర్ కు కేటీఆర్ కీలక పిలుపు..!!

మొదటి పేజి తరువాయి

ఎప్పుడు వచ్చినా ప్రజలే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఆవిర్భావ సభలో కేసీఆర్ భవిష్యత్ లక్ష్యాలను స్పష్టం చేస్తారని వెల్లడించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభ కోసం గ్రేటర్ పరిధిలోని ప్రతీ కాలనీ నుంచి కేడర్ కదలాలని కేటీఆర్ సూచించారు. జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తున్నామని వెల్లడించారు. పార్టీ ఓటర్లు గా ఉన్న వారికి విప్ జారీ చేస్తామని, ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. బీఆర్ఎస్ సాధించిన విజయాలు అసమాన్యమైనవని, అనితర సాధ్యమైనవని కొనియాడారు. 2017 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 150కి 99 కార్పొరేట్ స్థానాలు గెలిచి బీఆర్ఎస్ చరిత్ర సృష్టించిం దని చెప్పారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో క్లీన్ స్వీప్ చేశామన్నారు. 2023 అసెం బ్లీ ఎన్నికల్లోనూ ఓఆర్ఆర్ లోపల గులాబీ జెండానే ఎగిరిందని తెలిపారు. హైదరాబాద్ వాసుల ముందు కాంగ్రెస్, బీజేపీ మాయమాటలతో ఉపయోగం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ పైన కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేసారు. హైడ్రా పేరుతో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అరాచకం సృష్టించారని కేటీఆర్ అన్నారు. తన అన్న ఇంటిని కూల్చలేదని విమర్శిం చారు. ధనవంతుల ఇళ్లను ముట్టుకోలేదని తెలిపారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా హైడ్రా తన పనితీరు మార్చుకోలేదని అన్నారు. హైడ్రా దెబ్బ, రేవంత్ చేతగానితనానికి హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పతనమైందని తెలిపారు. లక్ష మంది ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కాడితే గాని డొక్కాడని పేదల కడుపు కాంగ్రెస్ కొట్టిందని అన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు డబ్బులు లేవని అంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ అంటున్నా రని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఎస్టీపీలను కట్టి మూసీలోకి వ్యర్థాలు పోకుండా చేశామని గుర్తుచేశారు. మూసీ కోసం ఇండ్లను కోల్పోయినవారు బూతులు తిడితే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ధరణితో దందాలు చేశారు.. అలాంటి వాటికి భూ భారతిలో చోటు లేదు..

మొదటి పేజి తరువాయి



అలాంటి వాటికి ఇప్పుడు భూభారతిలో చోటు లేదన్నారు. గత పదేళ్లుగా ఆక్రమించిన భూ భాగోతం మొత్తం బయట కొస్తుందనే భయం వారికి పట్టుకుంది.. ఇంట్లో కూర్చోని ధరణి తయారు చేశారు.. విచ్చల విడిగా దొంగ వార్తలు ప్రచురిస్తున్నారు.. భూ భారతిలో వాళ్ల ఆగడాలు బయటకు వస్తాయనే అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారు.. తప్పుడు వార్తలకు ప్రయార్టీ ఇస్తున్నారు.. ప్రజలు ఆలోచించాలి అని సూచించారు. వాళ్ల లాగా దొంగ మాటలు చెప్పి అధికారంలోకి రాలేదు.. మాది ప్రజల ప్రభుత్వం.. ధరణికి భూ భాతరతికి చాలా తేడా ఉంద అని మంత్రి సీతక్క వెల్లడించింది. అయితే, అధికారులు తప్పుడు పనులు చేయకండి అని మంత్రి సీతక్క కోరారు. గత ప్రభుత్వం వీఆర్ఓలను వాడుకోని వదిలేశారు.. పేదల హక్కులు తీసేసి బడా బాబులకు అనుకూలంగా వాడుకున్నారు.. ఇక, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో కొంత మంది లీడర్లు డిక్టేటర్లుగా వ్యవహరిస్తున్నారు.. మంత్రి వర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లాకు ప్రయార్టీ ఉంటదని తేల్చి చెప్పింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయి.. బీసీ బిల్లు కోసం ఎదురు చూస్తున్నాం అని పేర్కొనింది. జిల్లాలో ఎన్ని గ్రూపులు ఉన్నా సరే నేను సిన్సియర్ గా పని చేస్తున్నాను.. కొంత మంది తప్పును ప్రశ్నిస్తే వాళ్లకు నచ్చడం లేదు.. ఎంపీ ఎన్నికల్లో 4 లక్షల ఓట్లు తెప్పించాం.. అక్కడక్కడ లీడర్లు వేరే వాళ్లకు పదవు ఇవ్వొద్దని అంటున్నారు.. అలాంటి ఆలోచన తప్పు అన్నారు. రాజకీయం అంటేనే అందరు ఉండాలి.. అప్పుడు పబ్లిక్ లీడర్ గా పేరు వస్తుందని సీతక్క చెప్పుకొచ్చింది.

# మీ ఆలోచనలను ప్రభుత్వంతో పంచుకోండి..

మొదటి పేజి తరువాయి




"తెలంగాణలో పరిశ్రమలు రావాల్సి ఉంది.. మన దగ్గర భూమి సరిపడా ఉంది.. పరిశ్రమల్ని ఆహ్వానిస్తున్నాం.. గుజరాత్ లో సబర్మతి కట్టుకున్నారు.. బీజేపీ వాళ్ల డిల్లీలో యమున నది శుద్ధి చేస్తామంటారు.. కానీ తెలంగాణలో మూసి పునరుజ్జీవం చేస్తామంటే.. బీజేపీ, బీఆర్ఎస్ వాళ్ళు అడ్డుకుంటున్నారు.. మూసి ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది.. చెరువుల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనది.. నడి చెరువులో ఇండ్లు కడితే కూడా కూల్చొద్దు అంటున్నారు.. జపాన్ లో ఉండి మీరు కూడా చూస్తున్నారు.. సాగు నీరు.. పరిశ్రమల ఏర్పాటు.. ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నాం.. తెలంగాణ అభివృద్ధికి అందరూ సహకరించాలి.. మీ ఊరు బాగుపడింది అంటే మీకు సంతోషం కాదా.. తెలంగాణ ప్రపంచంతో పోటీ పడాలి.. జపాన్ లో ఉన్న మీరు కూడా మాతృభూమికి అంతో ఇంతో అండగా ఉండండి" అని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్రం ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకుపోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో డ్రై పోర్ట్ ఏర్పాటుతో మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన ఉద్ఘాటించారు. జపాన్ పర్యటనలో సీఎం నాలుగో రోజు పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా టోక్యోలు ఏర్పాటు చేసిన తెలుగు సమాఖ్య కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మూసీ నది ప్రక్షాళన విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్నాయని మండిపడ్డారు. "గుజరాత్‌లో మోడీ సబర్మతి రివర్ ఫ్రంట్ కట్టుకుంటే, ప్రయాగరాజ్‌లో గంగానది ఒడ్డున రివర్ ఫ్రంట్ ఉంటే, మరి తెలంగాణలో మూసీ ప్రక్షాళన ఎందుకు కాకూడదు?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. నీరు మన సంస్కృతికి, అభివృద్ధికి ప్రతీక అని ఆయన అన్నారు. నాలాల ఆక్రమణలు తొలగించకపోతే, చెరువుల మధ్యలో నిర్మాణాలు కూల్చకపోతే ప్రకృతి మనల్ని క్షమించదని ఆయన హెచ్చరించారు. మూసీ అభివృద్ధికి అడ్డుపడే శక్తులు బీఆర్ఎస్, బీజేపీలే అని ఆయన నిందించారు. ఢిల్లీలో కాలుష్యంతో అన్ని సంస్థలకు సెలవులు ఇస్తున్న పరిస్థితి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. కేవలం కాలుష్యంతో ఢిల్లీ నగరం స్థంభించే పరిస్థితి ఉంటే.. మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం లేదా.. అని ప్రశ్నించారు. అందుకే హైదరాబాద్ లో మూసీ ప్రక్షాళన చేయాలని చెబుతున్నాని స్పష్టంచేశారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి అత్యంత కీలకమైన అంశాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్ పర్యటనలో తెలంగాణకు భారీ పెట్టుబడులు వెల్లువెత్తాయి. హైదరాబాద్‌లో అత్యాధునిక AI డేటా సెంటర్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయడానికి NTT డేటా, నెయిసా నెట్‌వర్క్స్ సంయుక్తంగా ముందుకు వచ్చాయి. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి దాదాపు 10 వేల 500 కోట్ల రూపాయల భారీ పెట్టుబడితో ఈ క్లస్టర్ రూపుదిద్దుకోనుంది. ఈ మేరకు ఇరు సంస్థలు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. మరోవైపు, తోషిబా సంస్థ రుద్రారంలో కొత్త ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడానికి సుముఖత వ్యక్తం చేసింది. 562 కోట్ల రూపాయల పెట్టుబడితో TTDI సర్జ్ అరెస్టర్స్ ఫ్యాక్టరీని నెలకొల్పడానికి ఒప్పందం కుదిరింది. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో NTT డేటా, నెయిసా నెట్‌వర్క్స్ ప్రతినిధులు ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ AI డేటా సెంటర్ క్లస్టర్ దేశంలోనే అతిపెద్ద AI కంప్యూట్ మౌలిక సదుపాయంగా నిలవనుంది. 25,000 GPU లతో దేశంలోనే అత్యంత శక్తివంతమైన AI సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను ఇది సమకూరుస్తుంది. తెలంగాణను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ ప్రాజెక్టు ఒక మైలురాయి కానుందని ధిమా వ్యక్తం చేశారు. ఈ క్లస్టర్‌కు 500 మెగావాట్ల వరకు గ్రిడ్, పునరుత్పాదక విద్యుత్తును వినియోగించనున్నారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను ఉపయోగించనున్నారు. అత్యున్నత పర్యావరణ, సామాజిక, పాలన ప్రమాణాలతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తారు. ఈ క్యాంపస్ తెలంగాణలోని విద్యా సంస్థలతో భాగస్వామ్యం కలిగి AI ప్రతిభను పెంపొందిస్తుంది. రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు ఇది గణనీయంగా దోహదం చేస్తుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు..

## కెనడాలో గ్యాంగ్ వార్.. బుల్లెట్ తగిలి భారత విద్యార్థిని మృతి

న్యూఢిల్లీ : జూ ఉన్నత విద్య కోసం కెనడా వెళ్లిన భారతీయ విద్యార్థిని ఒకరు అక్కడ జరిగిన కాల్పుల్లో అన్యాయంగా ప్రాణాలు కోల్పోయారు. అంటారియో ప్రావిన్స్‌లోని హామిల్టన్ నగరంలో బుధవారం సాయంత్రం ఈ విషాదకర సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొహాక్ కాలేజీలో చదువుతున్న హర్‌సిమ్రత్ రంధావా (21) అనే విద్యార్థిని, పనికి వెళ్లేందుకు స్థానిక బస్టాప్‌లో వేచి ఉన్నారు. అదే సమయంలో రెండు కార్లలోని వ్యక్తుల మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఒక బుల్లెట్ హర్‌సిమ్రత్ ఛాతీకి తగిలింది. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 7:30 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్లు హామిల్టన్ పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, తీవ్ర గాయాలతో పడి ఉన్న హర్‌సిమ్రత్‌ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ కాల్పుల ఘటనతో హర్‌సిమ్రత్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఆమె అమాయకురాలని పోలీసులు స్పష్టం చేశారు. రెండు వాహనాల మధ్య జరిగిన గొడవలో ఈ దుర్ఘటన జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనా స్థలం నుంచి లభించిన వీడియో ఆధారంగా, నల్ల కారులోని ప్రయాణికుడు తెల్ల కారుపై కాల్పులు జరిపినట్లు గుర్తించారు. ఘటన అనంతరం రెండు వాహనాలు అక్కడి నుంచి వెళ్లిపోయాయి. హర్‌సిమ్రత్ రంధావా మృతి పట్ల టొరంటోలోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఆమె కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరుపుతున్నామని, వారికి అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. హర్‌సిమ్రత్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. ఘటనపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసినట్లు హామిల్టన్ పోలీసులు వెల్లడించారు. ఘటనపై సమాచారం తెలిసిన వారు లేదా డ్యాష్ కెమెరా ఫుటేజీ ఉన్నవారు తమను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## బెంగాల్ లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్

మొదటి పేజి తరువాయి

అవసరం ఉందని ఓ మీడియాతో అన్నారు. "బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్రానికి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశా. ఇప్పటికీ కేంద్ర హోం శాఖను అదే కోరుతున్నా. కనీసం ఇప్పుడైనా స్పందించి సైన్యాన్ని దించండి. అప్పుడు ఇక్కడ ఎన్నికలు సజావుగా జరుగుతాయి" అని అన్నారు. కాగా.. వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముర్షిదాబాద్‌లో జరిగిన అల్లర్లపై స్పందించిన ఆయన.. ఇలాంటి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మరోవైపు, వచ్చే ఏడాదిలో బెంగాల్ లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇలాంటి సమయంలో ఆయన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేగుతున్నాయి.

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా..


ఇదిలా ఉంటే.. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 8-12 తేదీల మధ్య షంషేర్‌గంజ్, సూటి, ధులియాన్, జంగిపూర్ ప్రాంతాల్లో ఘర్షణలు జరిగాయి. ముగ్గురు మరణించగా.. వందల మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఉద్రిక్తతల వేళ కలకత్తా హైకోర్టు ఆదేశాలతో భారీగా కేంద్ర బలగాలను మోహరించాల్సి వచ్చింది. మరోవైపు.. సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించొద్దన్న సీఎం మమతా బెనర్జీ విజ్ఞప్తిని ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ పట్టించుకోలేదు. మాల్దా క్యాంప్‌లలో ఉన్న బాధిత కుటుంబాలను కలిసి ఆయన మాట్లాడారు. మరోవైపు.. జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహాట్కర్ నేతృత్వంలోని బృందం సైతం రిలీఫ్ క్యాంప్‌లలో పర్యటించింది.

## మోదీ ప్రతిపాదనకు ఒప్పుకొన్న మస్క్- గేమ్ ఛేంజ్

మొదటి పేజి తరువాయి

అనేక అంశాలు ఆయనతో చర్చించారు. టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగాల్లో భారత్- అమెరికా మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసే విషయంపై ఈ ఇద్దరు నాయకులు మధ్య సుదీర్ఘంగా ఫోన్ సంభాషణ సాగింది.ఈ సంవత్సరం ప్రారంభంలో వాషింగ్టన్ డీసీలో ఎలాన్ మస్క్‌తో జరిగిన సమావేశంలో ప్రస్తావ-నకు వచ్చిన అంశాలపైనా చర్చించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఈ మేరకు ఓ ట్వీట్ పోస్ట్ చేశారు. వివిధ సమస్యల గురించి మాట్లాడినట్లు పేర్కొన్నారు. టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగాల్లో భారత్ పురోగమించడానికి సహకరించాలని, అమెరికాతో ఉన్న సత్సంబంధాలను ముందుకు తీసుకెళ్లడానికి కట్టుబడి ఉన్నామని వివరించారు.ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా, స్టార్‌లింక్ సంస్థలు.. భారత్‌లో తమ సేవలను ప్రారంభించడానికి ప్రణాళికలను రూపొందించుకుంటోన్న ప్రస్తుత పరిస్థితుల మధ్య- ప్రధాని మోదీ స్వయంగా ఆయనకు ఫోన్ చేయడం, టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగాల్లో భాగస్వామ్యాన్ని కోరుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.భారత్‌లో టెస్లా కార్ల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని భావిస్తోంది టెస్లా. ఈ విషయంపై అధికారులతో చర్చలు జరుపుతోంది. అలాగే- దేశంలో స్టార్‌లింక్ ఉపగ్రహ ఇంటర్నెట్ సేవల ను తీసుకురావడానికి ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ జియోతో కూడా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కుదరినట్లు ఈ ఏడాది మార్చిలో రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్ ప్రకటించిన విషయం తెలిసిందే.ఈ ఏడాది ఫిబ్రవరిలో రెండు రోజుల పాటు అమెరికాలో పర్యటించినప్పుడు ఎలాన్ మస్క్‌తో భేటీ అయ్యారు ప్రధాని మోదీ. టెస్లా ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం, అంతరిక్షం వంటి రంగాల్లో పెట్టుబడుల గురించి మాట్లాడారు. అప్పట్లోనే ఏకాభిప్రాయానికి వచ్చారు. మోదీ ఫోన్ కాల్‌తో ఆ కార్యాచరణ ప్రణాళిక మళ్లీ తెర మీదికి వచ్చింది.కాగా- మోదీ చేసిన ట్వీట్‌కు ఎలాన్ మస్క్ కొద్దిసేపటి కిందటే రిప్లై ఇచ్చారు. ప్రధాని మోదీతో మాట్లాడిన విషయాన్ని నిర్ధారించారు. అలాగే- తన భారత పర్యటన గురించీ అధికారికంగా వెల్లడించారు. ప్రధాని మోదీతో మాట్లాడటం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని ఎలాన్ మస్క్ అన్నారు. ఈ ఏడాది చివర్లో భారత పర్యటనకు వస్తానని పేర్కొన్నారు.ం

## జగన్ తో మనస్పర్థలు రావడానికి తొలి కారణం ఇదే: రఘురామకృష్ణరాజు



అమరావతి : జూవైసీపీ తరపున ఎంపీగా గెలుపొంది ఆ పార్టీ అధినేత జగన్ నే ఎదిరించిన చరిత్ర ప్రస్తుత ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుది. జగన్ కు వ్యతిరేకంగా మాట్లా డటానికి ఏపీలో ఎవరూ సాహసించని సమయంలో ఆయ నను రఘురామ ఢీకొ న్నారు. వైసీపీలోనే ఉంటూ జగన్ పై, ఆ పార్టీలోని కీలక నేతలపై యుద్ధమే చేశారు. తాజాగా ఓ కార్యక్రమంలో రఘురామ మాట్లాడుతూ... జగన్ తో తనకు విభేదాలు ఎందుకొచ్చాయో వెల్లడించారు. ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు పట్ల వైసీపీ నేతలు చులకనగా మాట్లాడేవారని... అలా మాట్లాడటాన్ని తాను విభేదించడం వల్ల జగన్ తో తనకు తొలుత మనస్పర్థలు వచ్చాయని రఘురామ తెలిపారు. ఆ తర్వాత విభేదాలు ముదిరాయని చెప్పారు. తాను రాజకీయాల్లోకి వస్తానని కలలో కూడా ఊహించలేదని... తాను రాజకీయాల్లోకి రాకముందే ఎంతో మందికి ఎమ్మెల్యే టికెట్లు ఇప్పించానని తెలిపారు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం బలిజేపల్లిలో జరిగిన ఎన్టీఆర్, కోడెల శివప్రసాద్ ల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రఘురామ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైవ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెల శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక నుంచి రాజ్యసభకు వైఎస్ షర్మిల!

మొదటి పేజి తరువాయి

బలంగా ఉన్న రెడ్డి సామాజికవర్గం, క్రిస్టియన్ ఓట్లను ఆకర్షించడానికి కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని అంటున్నారు. అంతేకాకుండా తమ పార్టీ నేత, దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి ప్రాధాన్యమిస్తున్నామని రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ చెప్పుకోవాలని కాంగ్రెస్ భావిస్తోందని అంటున్నారు. కర్ణాటకలో ఖాళీగా ఉన్న నాలుగు రాజ్యసభ స్థానాల్లో ఒకటి ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు కేటాయించాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించినట్లు సమాచారం. గత సార్వత్రిక ఎన్నికల ముందు తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసినప్పుడే షర్మిలను రాజ్యసభకు పంపుతామని ఆ పార్టీ పెద్దలు హామీ ఇచ్చిరాంటున్నారు. దీంతో వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో షర్మిలను రాజ్యసభకు పంపాలని నిర్ణయించారని అంటున్నారు. రాజ్యసభలో బలమైన గొంతుక అవసరం అవ్వడం, షర్మిల కూడా వాగ్ధాటి ఉన్న నాయకురాలు కావడంతో ఆమెను రాజ్యసభకు తీసుకువెళ్లాలని కాంగ్రెస్ భావిస్తోంది.షర్మిలకు రాజ్యసభ ఇవ్వడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని కాంగ్రెస్ లెక్కలేసుకుంటోంది. బలమైన సామాజిక నేపథ్యంతోపాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో షర్మిల తండ్రి రాజశేఖర్ రెడ్డికి ఉన్న గుర్తింపు వల్ల షర్మిలకు పదవి ఇవ్వడం రాజకీయంగా ఉపయోగపడుతుందని కాంగ్రెస్ భావిస్తోంది. ప్రస్తుతం ఎలాంటి అధికారిక పదవి లేకపోవడం వల్ల షర్మిల పోరాటానికి తగిన గుర్తింపు రావడం లేదని అంటున్నారు. ఏపీసీసీ చీఫ్ గా బాధ్యతలు స్వీకరించిన నుంచి ఆమె వెన్నుచూపని పోరాటం చేస్తూనే ఉన్నారు. అయితే ఏపీలో కాంగ్రెస్ స్థానాన్ని వైసీపీ ఆక్రమించడంతో ఆమె ప్రయత్నాలకు తగిన మద్దతు లభించడం లేదంటున్నారు. షర్మిలను రాజ్యసభకు పంపడం ద్వారా ఏపీలోని పాత కాంగ్రెస్ శ్రేణులకు నమ్మకం కలిగించాలని కాంగ్రెస్ భావిస్తోంది. పార్టీని నమ్ముకున్న వారికి న్యాయం చేస్తామని చెప్పడం ద్వారా ఇతర పార్టీల్లో ఉన్న కాంగ్రెస్ కేడర్ ను తిరిగి ఆకర్షించాలని చూస్తోంది. ఇందుకోసం తెలంగాణ, కర్ణాటకల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాల సహకారం తీసుకోవాలని కూడా ఆలోచన చేస్తోందంటున్నారు. ఏ విషయంపైన అయిన స్పష్టమైన వైఖరి ప్రదర్శించగల నేర్పు, మాట తీరు కూడా షర్మిలకు అదనపు అడ్వాంటేజ్ అయిందని అంటున్నారు. ఆమెలా జనాలను ఆకట్టుకునేలా మాట్లాడే వారు కాంగ్రెస్ లో ఇప్పుడు తగ్గిపోయారని, దీంతో షర్మిల సేవలను దక్షిణాదిలో ఎక్కువగా వాడుకోవచ్చని కాంగ్రెస్ ఆలోచిస్తోందని అంటున్నారు.

## జిల్లాకు ఒక సైబర్ క్రైం పోలీస్ స్టేషన్..!

మొదటి పేజి తరువాయి

అధికారులతో సమీక్ష నిర్వహించారు హోంమంత్రి.. గుంటూరు, రాజధాని అమరావతి, హైకోర్టు, పొలిటికల్ పార్టీల ఆఫీసులు ఈ ప్రాంతంలో ఉన్నాయని.. పల్నాడులో ఫ్యాక్షన్ కొన్నిచోట్ల ఉంది.. నలభై గ్రామాల్లో ఫ్యాక్షన్ కనిపిస్తుందన్నారు.. ఇక, సైబర్ క్రైం ప్రకాశం జిల్లాలో జీరో వెల్లడించారు అనిత.. గుంటూరు జిల్లాలో అనేక కేసుల్లో రికవరీ బాగుందన్న ఆమె.. పోలీసుల భద్రత చూడాల్సిన అవసరం ఉంది. గుంటూరు జిల్లాలో పోలీసులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇక, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముప్పై పోక్సో కేసుల్లో శిక్షలు పడ్డాయని తెలిపారు హోం మంత్రి అనిత.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 12 కోట్లు ఖర్చు పెట్టి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పబ్లిక్, ప్రైవేట్ ప్లేసులలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలను కోరారు.. మరోవైపు, బాపట్ల సముద్రతీరప్రాంతంలో డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేస్తున్నాం. ప్రజల రక్షణే భద్రతగా పోలీసులు పనిచేస్తున్నారు. కొత్తగా పది పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. జిల్లాకు ఒక సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తాం అన్నారు.. ప్రమోషన్ల విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. వాటిపై దృష్టి పెడతామన్నారు.. గత ఐదేళ్లలో పోలీస్ శాఖలో రిక్రూట్‌మెంట్ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత..

## కీలక నిర్ణయాలకు సిద్ధమైన జగన్ - 22, 23 తేదీల్లో ప్రకటనలు..!

మొదటి పేజి తరువాయి

లేక పోరాటం చేయాలా అన్న దానిపై క్లారిటీ లేదు. ఈ నేపథ్యంలో సొంత పార్టీ నేతలకు భవిష్యత్ రాజకీయంపై దిశానిర్దేశం చేసేందుకు జగన్ సిద్ధమవుతున్నారు. ఇందుకోసం రెండు కీలక భేటీలు నిర్వహించబోతున్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీకి సంబంధించిన కీలక నేతలతో జగన్ భేటీ కాబోతున్నారు. ఇందులో 22వ తేదీన వైసీపీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీతో జగన్ సమావేశం కాబోతున్నారు. ఇందులో తాజా రాజకీయ పరిణామాలతో పాటు భవిష్యత్ కార్యాచరణపై జగన్ చర్చించనున్నారు. అలాగే పార్టీ భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై నేతలకు దిశానిర్దేశం కూడా చేయబోతున్నారు. మరోవైపు ఈ నెల 23న జిల్లా సోషల్ మీడియా, వైసీపీ అధ్యక్షులతో వైఎస్ జగన్ సమావేశం అవుతారు. ఇందులో వైసీపీ సోషల్ మీడియా తిరిగి యాక్టివ్ కావడంపై దిశానిర్దేశం చేయబోతున్నారు. అసలే కూటమి సర్కార్ కేసులతో వైసీపీ సోషల్ మీడియా పూర్తిగా డల్ అయిపోయింది. దీంతో భవిష్యత్తులో ఎలాంటి వ్యూహంతో ముందుకెళ్లాలన్న దానిపై సోషల్ టీమ్స్ కు జగన్ దిశానిర్దేశం చేస్తారు. అలాగే జిల్లాల అధ్యక్షులు ఆయా జిల్లాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రభుత్వ తప్పిదాలు, ఎన్నికల హామీల ఉల్లంఘనపై జనంలోకి వెళ్లి ఎలా వివరించాలో జగన్ సూచనలు చేయబోతున్నారు. వైసీపీని, ఎంపీ పదవినీ, రాజకీయాల్ని వీడిపోయిన విజయసాయిరెడ్డి ఇప్పుడు తన చుట్టూ కోటరీ ఉందంటూ పలుమార్లు చేసిన విమర్శలపై జగన్ ఈ భేటీల్లో క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది. అలాగే మద్యం కుంభకోణం పేరుతో కూటమి సర్కార్ తమను టార్గెట్ చేస్తున్న తీరుపైనా నేతలకు వివరిస్తారు. దీంతో పాటు కేంద్రంలో ఎన్డీయే సర్కార్ తో వ్యవహరించాల్సిన తీరుపైనా ఎంపీలకు కీలక సూచనలు చేస్తారని తెలుస్తోంది.ం

## విశాఖ మేయర్ పీఠం కూటమి కైవసం

మొదటి పేజి తరువాయి

జీవీఎంసీలో మొత్తం పార్టీని వీడటంతో కూటమి బలం పెరిగింది.97 మంది సభ్యులు ఉన్నారు. ఈనాటి సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిసి 74 మంది కూటమి సభ్యులు హాజరయ్యారు. వీరంతా అవిశ్వానికి మద్దతుగా ఓటు వేశారు. పార్టీ మారిన కార్పొరేటర్లను కట్టడి చేసేందుకు వైసీపీ విప్ జారీ చేసినా వ్యూహం ఫలించలేదు. మరోవైపు కౌన్సిల్ సమావేశాన్ని వైసీపీ సభ్యులు బహిష్కరించారు. దీంతో, వైసీపీ మేయర్ హరివెంకట కుమారి పదవిని కోల్పోయారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో జీవీఎంసీ కార్యాలయం వద్ద కూటమి నేతలు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని వేడుక చేసుకున్నారు. విశాఖ జీవీఎంసీ మేయర్ పీఠంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. జీవీఎంసీ మేయర్ పీఠాన్ని అధికార టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి కైవసం చేసుకుంది. వైసీపీ మేయర్ హరి వెంకట కుమారిపై కూటమి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాసానికి అనుకూలంగా 74 మంది సభ్యులు ఓటేయడంతో నో కాన్ఫిడెన్స్ మోషన్ పాస్ అయ్యింది.కాగా, కోరమ్ సరిపోవడంతో శనివారం (ఏప్రిల్ 19) జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు జిల్లా కలెక్టర్. సమావేశం ప్రారంభం కాగానే.. హెడ్ కౌంట్ అనంతరం అందరి వద్ద సంతకాలు తీసుకుని ఓటింగ్ ప్రక్రియ చేపట్టారు. ఓటింగ్‌లో 74 మంది సభ్యుల బలంతో కూటమి విజయం సాధించింది. మరోవైపు.. ప్రతిపక్ష వైసీపీ సభ్యులు కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించారు. మేయర్ పీఠం దక్కడంతో..

కూటమి కార్పొరేటర్లు ఆదివారం (ఏప్రిల్ 20) మేయర్?ను ఎన్నుకోనున్నట్లు సమాచారం.కాగా, విశాఖ మేయర్ పీఠం కోసం అధికార కూటమి, వైసీపీ ఎత్తుకు పై ఎత్తులు వేశాయి. ఇరు వర్గాలు కార్పొరేటర్లను క్యాంపులకు తరలించాయి. పీఠాన్ని ఎలాగైనా కాపాడుకోవాలని వైసీపీ చివరి వరకు విశ్వప్రయత్నం చేసింది. చివరకు కార్పొరేటర్లకు విప్ కూడా జారీ చేసింది. అయినప్పటికీ మేయర్ పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో విశాఖ మేయర్ సీటు కూటమి వశమైంది. విశాఖ మేయర్ పీఠం దక్కడంతో కూటమి సభ్యులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత గంటా శ్రీనివాస్ రావు మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడారని అన్నారు. త్వరలోనే మంచి కూటమి నుంచి మంచి మేయర్ ను ఎన్నుకుంటామని తెలిపారు. ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ.. న్యాయం, ధర్మం గెలించిందని అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు. మృతి..



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. ఏప్రిల్.19. (శుభోదయం న్యూస్) (స్టాఫ్ రిపోర్టర్) (కొమ్ము శ్రీనివాసరావు). రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన. శనివారం ఉదయం జరిగింది. సంఘటనకు సంబంధించిన వివరాలు. మృతుడు కొమ్ము నాగేశ్వరరావు (39) ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం సీతారామ నగరం గ్రామం. సరిహద్దు రాష్ట్రమైన తెలంగాణలోని బూర్గంపాడు మండలం కేంద్రంలో గల ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలు సూపర్వైజర్ గా గత 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు. పెద్ద కొడుకు కొమ్ము కుష్వంత్ (18) చిన్న కుమారుడు. కొమ్ము సుశాంత్(17)పెద్దవాడు బీటెక్ చదువుతుండగా రెండోవాడు ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. మృతుడు కొమ్ము నాగేశ్వరరావు శుక్రవారం రాత్రి సారపాకలో నివాసం ఉంటున్న అక్క వద్ద ఆగిపోయి. రోజు ఉదయం ఉపాధి హామీ పనుల కోసం ఉదయం 5 గంటలకు బయలుదేరి వస్తుండగా బూర్గంపాడు శివారులో గల కొల్లు వద్ద ఈరోజు ఉదయం 5:30 6:00 గంటల మధ్య మధ్య ఇసుక కోసం వెళ్తున్న ఎడ్ల బండిని ప్రమాదవశాత్తు ఢీకొనడంతో కడుపులో బలమైన దెబ్బ కడుపులో తలగటంతో స్పృహ పడిపోయారు. ఇరుగుపొరుగువారు గమనించి అంబులెన్స్ రప్పించి హుటాహుటిన భద్రాచలం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా గాయపడిన కొమ్ము నాగేశ్వరరావు అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుని భార్య కొమ్ము రాజశ్రీ బూర్గంపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు కొమ్ము నాగేశ్వరరావు సౌమ్యుడనీ అందరితో కలివిడిగా కలుపుగోలుగా మసులుకునే వ్యక్తిని అట్టి వ్యక్తి ఈరోజు అకాల మరణానికి గురి కావడం పట్ల సీతారామ నగరం ఎస్సీ కాలనీలో విషాద ఛాయలు అమ్ముకున్నాయి. మృతుడు కొమ్ము నాగేశ్వరావు మంచితనానికి మారుపేరుగా పిలవబడే వ్యక్తిని అలాంటి వ్యక్తి ఈ విధంగా మరణించడం చాలా బాధాకరమని. మండల ఎస్సీ సెల్ తెలుగుదేశం పార్టీ నాయకులు. కొమ్ము రాము. రాయి రమణయ్య. ఎంపీటీసీ. కొమ్ము రవి. గంగాధరి రాంబాబు. రాయి ప్రసాదు. కడారి శ్రీ కన్య. కొమ్ము భాను ప్రకాష్. కొమ్ము జీవన్ కుమార్ మరియు వైఎస్ఆర్సిపి మండల ఎస్సీ సెల్ నాయకులు. కొమ్ము వీరబాబు. కొమ్ము తిరుపతిరావు. కొమ్ము రాము. కొమ్ము రాంబాబు. కొమ్ము శివగని. నిమ్మల ప్రసాద్ కొమ్ము తిరుపతయ్య తదితరులు మృతునీ కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబానికి అండగా ఉంటామని వారు కుటుంబానికి ధైర్యం చెప్పారు.

# ఆర్థిక సహాయం అందజేసిన ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పైల్వాన్ పురం గ్రామానికి చెందిన గంగాధరి శ్రీనివాస్ గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలుకు గాయం కాగా శనివారం ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి శ్రీనివాస్ ను పరామర్శించి 25,000/ ఇరవై అయిదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆయనకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. మండల పరిధిలో పేద ప్రజలకు అండగా నిలుస్తూ ఆర్థిక సహాయం అందజేస్తున్న ఏజేఆర్ సేవల పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఏజేఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఛలో వరంగల్ వాల్ పోస్టర్లు ఆవిష్కరణ చేసిన కేటీఆర్ సేన అధ్యక్షులు అఫ్రోజ్



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): చలో వరంగల్ భారత రాష్ట్ర సమితి రజతోత్సవ బహిరంగ సభఆవిష్కరించారు వారు మాట్లాడుతూ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు ప్రతి మండలంలోని గ్రామాలను నుంచి పెద్ద ఎత్తున బిఆర్ఎస్ కార్యకర్తలు వరంగల్ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు ఎండి అఫ్రోజ్ కురుమ గంగారం గంపల శంకర్ భూమేష్ అంజయ్య మాద లక్ష్మణ్ అయ్యుబ్ బాలయ్య సాయలు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గోదావరిఖని మార్కండేయ కాలనీలో ఉన్న బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ మూసివేత



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) : సమస్త రామగుండం మండల ప్రజలకు తెలియ చేయునది ఏమనగా గోదావరిఖని పట్టణం మార్కండేయ కలనీ లో ఉన్న బ్రిలియంట్ గ్రామర్ ఉన్నత ప్రైవేట్ పాఠశాలకు ప్రభుత్వ అనుమతులు లేవు.కావున తల్లిదండ్రులు ఇట్టి విషయాన్ని గమనించి తమ పిల్లలను ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలలో చేర్పించ వద్దని, ఎవరైనా అడ్మిషన్ చేయుటకు ప్రోత్సహించిన, ప్రచారం చేసిన చర్యలు తప్పవని శనివారం రోజున రామగుండం మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపినారు.

# రామగుండం ప్రాజెక్ట్ జనగామ సెక్టర్ అంగన్వాడి కేంద్రంలో 'పోషణ్ పక్వాడ్' కార్యక్రమం



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) : రామగుండం ప్రాజెక్ట్ జనగాను సెక్టార్ అంగన్వాడి కేంద్రంలో పోషణ్ పక్వాడ్ జనగామ -2, జనగాను-3, తారకరామనగర్ - 2 ఐబీ. కాలనీ కేంద్రాలలో గర్భిణీలకు శ్రీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సి సి ఈ లో భాగంగా పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి అసైన్మెంట్ కార్డులను ఇవ్వడం జరిగింది. సెక్టార్ సూపర్వైజర్ సరస్వతి పాల్గొని గర్భిణీలకు, పిల్లలకు సూచనలు, సలహాలు ఇచ్చారు అంగన్వాడి టీచర్స్ బి. రాజ్యలక్ష్మి, కె.అరుణ, బి. మంజుల, బి.సరోజ, ఆయాలు పాల్గొనడం జరిగింది.

# సన్న బియ్యం పంపిణీకి ప్రజల నుంచి సానుకూల స్పందన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.రామగుండం నగరం 46వ డివిజన్ అడ్డగుంటపల్లి ఎస్సీ కాలనీ లో పి.ఎల్లయ్య, లక్ష్మి ఆధ్వర్యంలో తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారుల ఆర్.అమృత, శారద, బి.గౌరవమణి, ఏ.స్వరూప కలిసి అమృత నివాసంలో ప్రభుత్వం ఇటీవలే పంపిణీ చేసిన సన్న బియ్యంతో స్థానిక ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ తో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాలతో తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, ఇక నుంచి రేషన్ లో సన్న బియ్యం మాత్రమే పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ సంతోష సమయంలో లబ్ధిదారుల తో కలిసి భోజనం చేశామని అన్నారు. సన్న బియ్యం పంపిణీకి ప్రజల నుంచి మంచి స్పందన ఉందని, ప్రజలకు ప్రతి నెలా నాణ్యమైన సన్నబియ్యం రేషన్ ద్వారా అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ పాతపల్లి ఎల్లయ్య, లక్ష్మి ఇంట్లో కలెక్టర్ తో కలిసి మధ్యాహ్న భోజనం సన్న బియ్యంతో చేయడం సంతోషంగా ఉందని, గతంలో ఉమ్మడి రాష్ట్రంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు లభించిందని, నేడు సన్న బియ్యం సరఫరా చేసి మంచి భోజనం చేసే అవకాశం కల్పించిందని లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేదల కలలు నిజం అవుతున్నాయని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 గ్యాస్ సిలిండర్ సరఫరా, రైతు భరోసా, రైతు రుణమాఫీ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 60 వేల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాల అపాయింట్మెంట్ ఆర్డర్స్ అందించామని, బీసీ కుల గణన చేసి వారికి రాజ్యాధికారం అందాలని 42% రిజర్వేషన్ కల్పించామని అన్నారు.దళిత వర్గీకరణ చేసిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో ఆవిర్భవించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, దేశానికి మార్గదర్శకంగా తెలంగాణలో పాలన నడుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం తాసిల్దార్ శ్రీపాద ఈశ్వర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రేస్ పార్టీ నాయుకులు తదితరులు పాల్గొన్నారు.

# మహమ్మద్ గౌస్ ఆశయ స్ఫూర్తితో ఉద్యమిద్దాం




బెల్లంపల్లి టౌన్: ఏప్రిల్ 18 ఉమ్మడి జిల్లా బ్యూరో చీఫ్ (శుభోదయం న్యూస్) :ఈరోజు బెల్లంపల్లి పట్టణంలోని ఎంసిపిఐ(యు) పార్టీ అమరవీరుల స్తూపం వద్ద అమరజీవి కామ్రేడ్ మహమ్మద్ గౌస్ నాలుగవ వర్ధంతిని ఎంసిపిఐ(యు)పార్టీ జిల్లాకార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్,సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ కామ్రేడ్ మహమ్మద్ గౌస్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తూ ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూఎంతో ఉన్నత చదువులు చదివి విద్యార్థి దశ నుండే వామపక్ష విద్యార్థి ఉద్యమాల వైపు ఆకర్షించబడి, పార్టీలో చేరి ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసి, సామాన్య కార్యకర్త నుండి అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర కార్యదర్శిగా,జాతీయ కార్యదర్శిగా ఎన్నుకోబడి ఈ దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా సోషలిజం, కమ్యూనిజం రావాలని, లాల్ జెండా నీల్ జెండా ఏకం కావాలని, చీలికలు పేలికలుగా ఉన్న ఎర్రజెండాలని ఏకం కావాలని,ఎర్రకోటపై ఎర్రజెండా ఎగరాలని కాంక్షించిన,ఎన్నో అలుపెరుగని మిలిటెంట్ పోరాటాలు చేస్తూ,ఎన్నో అక్రమ కేసులను, నిర్బంధాలను ఎదుర్కొంటూ, తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు ప్రజలకే తన జీవితాన్ని అంకితం చేసి పని చేసిన మహోన్నతమైన నాయకుడు కామ్రేడ్ మహమ్మద్ గౌస్ అని, కమ్యూనిస్టుమేధావి,సైద్ధాంతికవేత్త,పోరాటాల వెలుగు,ప్రజల మనిషి గౌస్ అని,ఆయన మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటని,ఆయన స్థానాన్ని ఎవరు భర్తీ చేయలేరని,యావత్తు ప్రజానికం ఆయన స్ఫూర్తిని అందిపుచ్చుకుని ఆయన ఆశయాల బాటలో పయనించాలని అపుడే ఆయనకు నిజమైన నివాళులు అర్పించిన వాల్లమవుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్,సతీష్, రాజశేఖర్,ఆకాష్,వేణు,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ హెరాల్డ్ చార్జిషీట్ను ఉపసంహరించుకోవాలి

## -కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు ఈతాప రాములు డిమాండ్



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్)బీకాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ,రాహుల్ గాంధీ పై వేసిన ఛార్జషీటిను ఉపసంహరించు కోవాలని కాంగ్రెస్ పార్ట జిల్లా సీనియర్ నాయకులు ఈతాప రాములు డిమాండ్ చేశారు.శుక్రవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విపక్షాల గొంతుఅణిచివేయాలని చూస్తోందని మండిపడ్డారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదన్నారు.నేషనల్ హెరాల్డ్ పత్రికను జవహర్లాల్ నెహ్రూ స్థాపించారని, అది కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారని, ఆ పత్రికకు నష్టాలు రావడంతో మూసివేశారన్నారు. ఈ ఆస్తులకు సంరక్షకులుగాఉన్న నేటి తరం కాంగ్రెస్ నేతలు వాటిని ఇతరత్రా కార్యక్రమాలకు వాడుతుంటే తప్పేంటో బీజేపీ ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.సోనియా గాంధీ రాహుల్ గాంధీపై వేసిన చార్జి షీట్ బేషరతుగా ఉపసంహరించుకోవాలని,లెదంటే దేశవ్యాప్త ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధమౌతుందని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

## పరకాల కాన్స్టిట్యూషన్ ఊరుకొండలో

## డా: పగడాల ప్రవీణ్ ఆత్మ శాంతించాలని కోవత్తుల ర్యాలీ



తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్): ఊరుగొండ స్థానిక క్రైస్తవ సంఘాలు,, ఆర్.సి.యం చర్చ్.బెయేర్శెబా చర్చ్ ,మౌంట్ ఈగల్స్ చర్చ్ గెస్తేమనే ప్రార్థన మందిరం,,4 సంఘాలఆధ్వర్యం లో పాస్టర్ ప్రవీణ్ పగడాల గారి శాంతి ర్యాలీ నీతిని త్యాగాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన స్వరూపులైన జీసస్ అని అన్నారు మానవాళి రక్షణ కోసం ఈ లోకంలో జన్మనిచ్చారని అందరిని సమానంగా చూడాలని ప్రేమ కరుణ భావాలతో మెలగాలని సేవతో ఉండాలని చెప్పిన కరుణామయుడు అన్నారు క్రైస్తవులు నిర్వహించబడింది.క్రొవత్తులతో శాంతి ర్యాలీ క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఫాదర్ ఇన్నారెడ్డి మాట్లాడుతూ క్రైస్తవం అంటే మతం కాదు అనిక్రైస్తవుల మీద దాడులు,తప్పుడు ప్రచారాలు, చేయడం మానుకోవాలి అని పిలుపునిచ్చారు.ప్రవీణ్ పగడాల గారి మరణానికి గల కారణమైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసినారు..ఈ కార్యక్రమంలో పాస్టర్ కార్నెల్




పాస్టర్ షాలెం రాజు ,సంగపెద్దలు, పోలేపాక మోగిలి ,పోలేపాక శ్రీనివాస్ జన్ను రాంచందర్ .జన్ను రమేష్ .జన్ను ఫ్రాన్సిస్ .జన్ను సుమన్ ,పోలేపాక ప్రవీణ్ జన్మ సాంబయ్య జన్ను కమలాకర్ విశ్వాసులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఆహ్వానము



ఉమ్మడి జిల్లా బ్యూరో చీఫ్ (శుభోదయం న్యూస్): కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలకు ఆహ్వానం తేదీ 21.04.2025 సోమవారం రోజున ఉమ్మడి ఆదిలాబాద్ ఇంచార్జి సీతక్క,రెవిన్యూ శాఖ, హౌసింగ్ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,ఉదయం 9:00 నుండి 11.00 గంటల వరకు ఆసిఫాబాద్ లోని ప్రేమల గార్డెన్ లో కార్యకర్తలు సమీక్షా సమావేశం నిర్వహించడం జరుగుతుంది కావున మండల పార్టీ అధ్యక్షులు,మాజీ ఎంపీపీ లు,మాజీ జడ్పీటీసీలు,మాజీ ఎంపీటీసీలు,మాజీ సర్పంచ్ లు యూత్ కాంగ్రెస్, (ఎన్.ఎస్.యు.ఐ) నాయకులు,బూత్ కమిటీ మెంబెర్స్, ఇందిరమ్మ కమిటీ మెంబెర్స్, మహిళ కాంగ్రెస్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు ముఖ్య నాయకులు కార్యకర్తలు సకాలంలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరు. డీసీసీ అధ్యక్షుడు ఆసిఫాబాద్ జిల్లా: కే విశ్వప్రసాద్ రావు.

## భారత రాజ్యాంగం పరిరక్షణ పాదయాత్ర

## ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు మోసెస్ ఆనంద్ కుమార్




తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్): వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే,హనుమకొండ జిల్లా అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో 48 వ డివిజన్ లో జై బాపు, జై భీమ్, జై సంవిందాన్ భారత రాజ్యాంగం పరిరక్షణ పాదయాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ సెక్రటరీ తెలంగాణ ఇంచార్జి,మాజీ ఎం.పీ విశ్వనాథన్ పెరుమాళ్ ఎంపీ కడియం కావ్య , జిల్లా అధ్యక్షులు,వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ,కూడ చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ,మేయర్ గుండు సుధా రాణి ,కార్పొరేటర్ అబూబాకర్ తో కలిసి పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోసెస్ ఆనంద్ కుమార్.ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న భాజపా ప్రభుత్వం దేశ రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను ప్రజలందరు గమనిస్తున్నారని తెలియచేస్తూ,జాతిపిత మహాత్మా గాంధీ మరియు రాజ్యాంగ రచయిత అంబేద్కర్ త్యాగాలను తెలియచేస్తు ప్రజలను చైతన్యవంతం చేయడం కోసమే ఈ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలియజేశారు. అంబేద్కర్ మరియు గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేసారు.

## : విధులకు డుమ్మా కొట్టిన ఉద్యోగుల పై కలెక్టర్ కు ఫిర్యాదు...

## సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీపీ ఆర్. రామాంజినమ్మ...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండలం పరిధిలోనే శభాష్ పురం గ్రామ సచివాలయంలో విధులకు డుమ్మా కొట్టిన ఉద్యోగులపై చర్యలు తీసుకునే విధంగా జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానని ఎంపీపీ ఆర్ రామాంజనమ్మ పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం శభాష్ పురం సచివాలయాన్ని ఎంపీపీ ఆర్. రామాంజనేయమ్మ తనిఖీ చేశారు .అయితే పలువురు సచివాలయ ఉద్యోగులు జి. లక్ష్మి (వి ఆర్ ఓ) శివ నాయక్ (డిజిటల్ అసిస్టెంట్), రాజ్ పవన్ కుమార్ ( వెల్ఫేర్ అసిస్టెంట్) వర్షిని (మహిళా పోలీస్) లు ఎలాంటి సెలవు పెట్టకుండా విధులకు డుమ్మా కొట్టడంతో వారిపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించవలసిన అధికారులు విధులకు హాజరు కాకపోవడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ఈ విషయంపై మండల స్థాయి అధికారులకు తెలియజేసినప్పటికీ వారు ఏమాత్రం పట్టించుకోవడంలేదని, అందువల్ల ఈ విషయంపై స్వయంగా జిల్లా కలెక్టర్లను కలిసి వారిపై చర్యలు తీసుకునే విధంగా ఫిర్యాదు చేస్తానని ఎంపీపీ ఆర్. రామాంజనేయ తెలిపారు. అలాగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి రోజు గ్రామసభ జరపకుండా సచివాలయనకి తాళాలు కూడా వేసినట్లు ఎంపీపీ ఆర్. రామాంజనమ్మ తెలిపారు

## రాంపల్లి లో

## స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ పై విద్యార్థులు ర్యాలీ...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండలం పరిధిలోనే రాంపల్లి గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ పై విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీని సర్పంచ్ మనేంద్ర, టిడిపి మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు ,విద్యార్థులు , స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ పై ప్రతిజ్ఞ లు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పులి రాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఈరోజు గ్రామంలో ఉండే ఎలక్ట్రికల్ వేస్ట్ మెటీరియల్ ను సేకరణ చేసి వాటిని కాల్చడం జరిగిందన్నారు. అలాగే పరిసరాల ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ రాజేశ్వరి ,ఇంజనీరింగ్ అసిస్టెంట్ సునీల్, హెల్త్ అసిస్టెంట్ రోజా, టిడిపి నాయకులు శ్రీనివాసులు, హేమాద్రి, ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

# బీసీలకు సముచిత స్థానం కల్పించిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు



పిడుగురాళ్ల, టౌన్ రిపోర్టర్ శీనివాసరావు (శుభోదయం నూస్): గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ గా వడ్డెర సామాజిక వర్గానికి చెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత తురక వీరస్వామి గారిని నియమించటం ఎంతో సంతోషకరమైన విషయంగా భావిస్తూ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కేసిన శంకర్రావు గారి ఆదేశాల మేరకు పిడుగురాళ్ల పట్టణ టిడిపి కార్యాలయంలో, బీసీ సంక్షేమ సంఘం గురజాల నియోజకవర్గం అధ్యక్షుడు కొక్కరకొండలు అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది . గురజాల నియోజకవర్గం లో బీసీల అభివృద్ధి కోసం అనునిత్యం కృషి చేస్తూ వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచి,బీసీ నాయకత్వాన్ని ముందుండి నడిపిస్తున్న గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు,ఈ సమావేశంలో బీసీ కళామండలి రాష్ట్ర కన్వీనర్ ముప్పన వెంకటేశ్వర్లు, పిడుగురాళ్ల పట్టణ అధ్యక్షుడు యడవల్లి కొండల గౌడ్, ఖాసీం సైదా, ఎరగాని వెంకట్, దాసరి నాగరాజు, నలబోతుల గాలయ్య, మల్లరవి, దగ్గ నాగేశ్వరరావు, జనతా గ్యారేజ్ సైదా, వల్లెపు రామకృష్ణ, దేవళ్ల దుర్గారావు, జమ్మిశెట్టి రామకృష్ణ, వాయిరి ప్రసాదు, నడికుడి వెంకటేశ్వరరావు, సలీం, కుంచపుశ్రీను, నారబోయిన నరసింహారావులు, పాల్గొన్నారు,

# తహసీల్దార్ ను సత్కరించిన టీడీపీ నేతలు



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): మండల తహసీల్దార్ కార్యాలయంలో కొత్తగా నియమితులై బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ మేరీ కనకంను శనివారం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలందించి శాలువా కప్పి సత్కరించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాకాంక్షలకు అనుగుణంగా కార్యాలయ సిబ్బంది సేవలు అందించేలా ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని టీడీపీ నేతలు తహసీల్దార్ కు ఈ సందర్భంగా విన్నవించారు. ప్రజలకు సంక్షేమం, విద్య ,వైద్యంతో పాటు రైతన్నలకు మెరుగైన సేవలందించడంలో సిబ్బందికి తగు సూచనలు చేసి రాజకీయ నేతలు, అధికారులు సత్సంబంధాలతో ముందుకు సాగాలని అభిలషిస్తున్నట్లు తహసీల్దార్ కు టీడీపీ నేతలు తెలిపారు. చట్టపరమైన చర్యలతో ప్రజలకు సులువుగా పనులు చేసేవిధంగా చర్యలు చేపట్టి, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి త్వరితగతిన పనులు పూర్తి చేయడానికి సహకరిస్తానని వారికి తహసీల్దార్ హామీనిచ్చారు. కార్యక్రమంలో గొంటు సుమంత్ రెడ్డి, బోడపాటి రామకృష్ణ, ఇన్నారెడ్డి, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

# : రైతులు పండించిన ధాన్యాన్ని దోచుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ రఘునాథ్ వెరబెల్లి





మంచిర్యాల జిల్లా: ఏప్రిల్ 19 (శుభోదయం న్యూస్) :ఈరోజు హాజీపూర్ మండలం పడ్తాన్ పల్లి, కర్ణమామిడి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు సందర్శించి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ధాన్యం కొనుగోలు విషయం లో అధికారులు, సెంటర్ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎలాంటి తాలు, తప్ప లేకున్నా ధాన్యం కొనుగోలు చేయాకుండా తూర్పాల పట్టిస్తున్నారని దాని వాళ్ల రైతుల వద్ద అధిక భారం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా కొనుగోలు సమయంలో ప్రతి 40 కేజీల ధాన్యం బస్తా పై అదనంగా 1.30 కేజీలు అదనంగా కాంట పెట్టి రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుంది అని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రసీదు కూడా ఇవ్వడం లేదని అన్నారు.రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి 15 రోజులు దాటిన ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు చేయడం ఆలస్యం కావడంతో అకాల వర్షాల వల్ల ఎక్కడ తమ వడ్లు తడుస్తాయో అని రైతులు ఆందోళన చెందుతున్న రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. అదే విధంగా రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం లేదు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం కటింగ్ పేరుతో దోచుకుంటుంది అని అన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చిన వెంటనే ఎలాంటి షరతులు లేకుండా కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో తమ్మిడి శ్రీనివాస్, పెద్దపల్లి పురుషోత్తం, మాధవరపు వెంకట రమణ రావు, ఎనగందుల కృష్ణ మూర్తి, బియ్యాల సతీష్ రావు, గడ్డం స్వామి రెడ్డి, బొలిశెట్టి అశ్విన్, మడిపెల్లి సత్యం, కొట్టే ప్రశాంత్, మారు వెంకట్ రెడ్డి, బొడ్డు తిరుపతి, జూపాక ధర్మయ్య మరియు తదితరులు పాల్గొన్నారు.

# చీకట్లో కమ్ముకున్న బెల్లంపల్లి పట్టణం



ఉమ్మడి జిల్లా బ్యూరో చీఫ్ (శుభోదయం న్యూస్): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో అప్రకటిత కరెంటు కోతలతో చిన్నపిల్లలకు ప్రజలకు చిన్న చిన్న వ్యాపారస్తులకు ఇబ్బందులకు గురి చేస్తున్న బెల్లంపల్లి (ఎన్ పి డి సి ఎల్) పగలు రాత్రి తేడా లేకుండా గంటల తరబడి విద్యుత్ సరఫరాను బెల్లంపల్లి ప్రజలకు అందివలేకపోతున్నారు బెల్లంపల్లి నియోజకవర్గంలో పేరుకే అతిపెద్ద సబ్ స్టేషన్ ఉంది( ఏఈ, ఏడీఈ, డిఈ) స్థాయి అధికారులు ఉండి కూడా ఇట్టి కరెంటు కోతలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం బెల్లంపల్లి దురదృష్టకరం.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కరెంటు కోతలు లేని పరిపాలన అందివ్వాలని అధికారులను ఆదేశించిన కూడా బెల్లంపల్లి అధికారులు మాత్రం డిప్యూటీ సీఎం మాటను కూడా బేకాతరు చేస్తున్నారు.లక్షలకు లక్షలు జీతాలు తీసుకొని ప్రజలను ఇబ్బంది పెట్టడానికి అధికారులకు ఏమాత్రం బాధ్యతగా బెల్లంపల్లి కరెంటు అధికారులు మేసులు కోవడం లేదుగత ప్రభుత్వ బిఆర్ఎస్ పార్టీ నాయకులుగా తొత్తుగా వ్యవరిస్తున్న ఈ కరెంటు అధికారులు ప్రజా ప్రభుత్వంలో కరెంటు కోతలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే విధంగా వ్యవహరిస్తున్నారు.ఎండి అఫ్జల్బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బెల్లంపల్లి ఇది కచ్చితంగా ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసే ప్రయత్నం అని ప్రజలు అంటున్నారు కావున కలెక్టర్ స్పందించగలరూకరెంటు నిర్లక్ష్యానికి బాధ్యులైన కరెంటు అధికారులపై కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకొని బెల్లంపల్లి ప్రజలకు కరెంటు కోతలు లేకుండా చూడగలరు.


## కాంట్రాక్టర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఉమ్మడి జిల్లా బ్యూరో చీఫ్ (శుభోదయం న్యూస్):మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం ఎర్రాయిపేట సమీపంలోని గోదావరి నది లో స్నానానికి వెళ్లి పూరెళ్ళ అశోక్ (20) అనే యువకుడు మృతి చెందాడని ఇసుక కాంట్రాక్టర్ పై చర్యలు చేపట్టి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ 63 వ జాతీయ రహదారి పై బైఠాయించి కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు కాంట్రాక్టర్ ధనాపేక్షతో పరిమితికి మించి గోదావరి నదిలో ఇసుక తవ్వకాలు జరపడం వల్ల ఏర్పడిన నీటి గుంతలో పడి మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు ఈ సంవత్సర కాలంలో ఈ గుంతలకు బలై ఎంతోమంది తమ ప్రాణాలు కోల్పోయినా అధికారుల చర్యలు శూన్యం అని ఆగ్రహం వ్యక్తం చేశారు,కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమని వాపోయారు.నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్ పై చట్టపరమైన చర్యలు చేపట్టి రూ. 50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని మృతుని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.



# నేర నిరూపణలో సిసి కెమెరాలు కీలకం బెల్లంపల్లి ఎసిపి రవికుమార్



ఉమ్మడి జిల్లా బ్యూరో చీఫ్ (శుభోదయం న్యూస్): ఈరోజు బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ సీ పీ కెమెరాల ఉపయోగం అవసరం పై అవగాహనా సదస్సు ఒక్క సిసి కెమెరా వందమంది పోలీసులతో సమానం కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణం లో గల ప్రాణహిత కాలనీలో సీసీ కెమెరాల ఉపయోగం అవసరం పై అవగాహనా కలిపించగా కాలనీ వాసులు సహకారంతో 16 సిసి కెమెరాలు కాలనీవాసుల సహకారంతో ఏర్పాటు చేయడం జరిగింది. కాలనీ వాసులతో కలిసి కమ్యూనిటీ సిసి కెమెరాలు ప్రారంభించారు.ఏసిపి మాట్లాడుతూసీసీ కెమెరాల ఏర్పాటు చేయడానికి సహకరించిన ప్రాణహిత కాలనీ ప్రజలకి అభినందనలు తెలిపారు. సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని సిసి కెమెరాలు ఉన్న ప్రాంతాలలో ఎలాంటి కేసులు నమోదు కావడం లేదని, ఏ చిన్న సంఘటన జరిగినా సీసీ కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవచ్చని , సీసీ కెమెరాలు మరింత భద్రత కల్పిస్తాయని, సీసీ కెమెరాల ద్వారా ఈ మధ్యకాలంలో చాలా కేసులు చేదించడం జరిగిందని తెలిపినారు. కేసుల ట్రయల్ సమయంలో సీసీ కెమెరాలు సాక్ష్యంగా ఉపయోగపడతాయని తెలిపారు.సీసీ కెమెరాలు రాత్రింబవళ్లు 24 గంటలు ప్రజలకు రక్షణ గా నిలుస్తాయని తెలిపినారు. మరియు పోలీస్ స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాలు లేని కాలనీలు సీసీ కెమెరాలు ఏర్పాటు గురించి ముందుకు వచ్చి పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా ప్రతి ఒక్కరూ సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం ద్వారా నేర రహిత సమాజ నిర్మాణం సాధ్యమని ఆయన చెప్పారు.సీసీ కెమెరాల ఏర్పాటు కు కృషి చేసిన కాలనీ వాసులను ఎసిపి,సిఐ శశిధర్ రెడ్డి, స్థానిక ఎస్సై తో కలిసి సన్మానించి, మిగిలిన కాలనీ వాసులకు ఆదర్శంగా నిలిచినందుకు అభినందించారు.ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి ఎస్సై రాజశేఖర్ పోలీస్ సిబ్బంది మరియు ప్రాణహిత కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# గింజ కటింగ్ లేకుండా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) ఏప్రిల్-19: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మరియు పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి. నిట్టూర్. తుర్కలమద్దికుంట. కాసులపల్లి. పాలితం. గోపయ్యపల్లి. కాపులపల్లి. కనగర్తి, మేరపల్లి. బొంపెల్లి. రాగినేడు. బ్రాహ్మణపల్లి. అప్పన్నపేట్. చందపల్లి. గౌరెడ్డిపేట మరియు ముత్తారం గ్రామాల్లో సింగల్ విండో మరియు ఐకెపి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం రోజున స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ.గింజ తరుగు లేకుండా కాంగ్రెస్ సర్కార్ వడ్లను కొనుగోలు చేస్తోందని.గత వానాకాలంలో పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్లో 147 మంది రైతులకు సన్నవడ్లకు రూ. 42,36,800 బోనస్ చెల్లించమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సన్నవడ్లకు రూ. 1234 కోట్లు బోనస్ చెల్లిస్తే పెద్దపల్లి నియోజకవర్గంలో రూ. 59.62కోట్లు చెల్లించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా సన్నవడ్లు పండించి ఎక్కువ బోనస్ పెద్దపల్లి నియోజకవర్గ రైతులకు దక్కిందన్నారు. ప్రస్తుత యాసంగిలో కూడా సన్నవడ్లకు రూ. 500 బోనస్ చెల్లిస్తామని పెద్దపల్లి పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా బోనస్ ఇస్తామన్నారు. సీఎం చొరవతో సీడ్ కంపెనీల యాజమాన్యాలు రైతులు చెప్పినట్లు నడుచుకునే స్థాయికి వచ్చారని. గతంలో కంటే క్వింటాల్ సీడ్ ధాన్యానికి రూ. 2 వేల నుండి 5 వేలవరకు ఎక్కువ ధర సీడ్ యాజమాన్యాలు చెల్లిస్తున్నారని అన్నారు. సీడ్ సాగు చేసిన రైతుల పంటలు ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతింటే ఎకరాకు రూ. 20 వేలు నష్టపరిహారం చెల్లిస్తామని సీడ్ కంపెనీల యాజమాన్యాలు రైతులకు బాండ్ పేపర్లు రాసిచ్చారని. అది కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సీడ్ పండించిన రైతుల ఒపి ధాన్యానికి క్వింటాలుకు రూ. 2900-3000 చెల్లిస్తున్నారని వివరించారు. 11ఏళ్ళ కాలం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, 10 ఏళ్లు రాష్ట్రంలో ఉన్న బీఆర్ఎస్ రైతులకు ఏం చేశారని ప్రశ్నించారు. రైతులకు మేలు చేస్తుంటే ఓర్వలేకనే ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు మరియు అప్పన్నపేట్ సింగిల్ విండో పరిధిలోని 17 గ్రామాల్లో గత వానాకాలంలో 2398 మంది రైతుల నుంచి 1,49,168 క్వింటాళ్ల సన్న ధాన్యం కొన్నామని వీరికి 7 కోట్ల 45 లక్షలకు పైగా బోనస్ చెల్లించామని తెలిపారు. అలాగే పెద్దపల్లి సింగిల్ విండో సొసైటీ పరిధిలోని 14 గ్రామాలలోని 3133 మంది రైతుల నుంచి 2,06,431.20 క్వింటాల్ సన్న వడ్లకు 10 కోట్ల 32 లక్షల 15 వేల 6 వందల బోనస్ రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని అన్నారు. నాలుగున్నర ఎకరాల వరకు ఎకరాకు రూ. 6 వేల చొప్పున రైతు భరోసా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేశామని గుర్తు చేశారు. ప్రస్తుత యాసంగిలో కూడా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కోతలకు తావులేదని స్పష్టం చేశారు. చివరి గింజవరకు మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప. వైస్ చైర్మన్ కూర మల్లారెడ్డి. పెద్దపల్లి. అప్పన్నపేట సింగిల్ విండో చైర్మన్లు మాదిరెడ్డి నర్సింహ రెడ్డి. చింతపండు సంపత్. విండో కార్యదర్శులు మధు. గడ్డి తిరుపతి.మార్కెట్. విండో డైరెక్టర్లు. అధికారులు. మాజీ జడ్పీటీసీ బండారి రామ్మూర్తి. సందనవేన రాజేందర్. నూగిల్ల మల్లయ్య. కాంగ్రెస్ నాయకులు. కార్యకర్తలు. రైతులు. హమాలీలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ డి పార్టీ కార్యాలయం ను ప్రారంభించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ



రామగుండం మండలం రిపోర్టర్ - తిరుపతి, (శుభోదయం న్యూస్) :తెలంగాణ రక్షణ సమితి డెమొక్రటిక్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా శనివారం రోజున రామగుండం నియోజకవర్గం గోదావరిఖనిలో టిఆర్ఎస్ డి పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీరాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతం కోసం స్థానిక నాయకులు సమిష్టిగా కృషి చేస్తున్నారని ఇక్కడి రామగుండం నియోజకవర్గం లో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని అన్నారు. తెలంగాణ ప్రాంతంలోని రాజకీయ పార్టీలకు దీటుగా టిఆర్ఎస్ డి పార్టీ ఉండబోతుందని అన్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పార్టీలోకి మేధావులు విద్యావంతులు ప్రొఫెసర్లు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు మరియు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు చేరబోతున్నారని తెలిపారు. తెలంగాణ ప్రాంత రాజకీయ పార్టీలకు దీటుగా టిఆర్ఎస్ డి పార్టీ ఉండబోతుందని అన్నారు.ఈ యొక్క కార్యక్రమంలో. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి శంకర్ గౌడ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు డాక్టర్ వాసంపల్లి ఆనంద్ బాబు. పార్టీ యూత్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఈదునూరి నర్సింగ్, ఎస్సీ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల రమేష్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు తోడేటి స్వరూప, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నేరెళ్ల జైపాల్ గౌడ్, చిగుర్ల రాజు, పోలే శ్రీనివాస్, కార్పొరేషన్ అధ్యక్షులు నీలం బిక్షపతి, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు శనిగారపు శివకృష్ణ, దిగువ యాదగిరి, వాసంపల్లి సంపత్, తాటికొండ రమేష్ కొండ అశోక్ బాలసాని సరోజన మంజుల తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## ఎంసిఏ 2023-25 బ్యాచ్‌కు వీడ్కోలు కార్యక్రమం




హైదరాబాద్, శుభోదయం న్యూస్: సీబీఐటీలోని ఎంసిఏ విభాగం, 2023-25 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల కోసం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం ప్రేరణ, ఆలోచన, మరియు ఆనందభరితంగా కొనసాగింది.వీడ్కోలు సందర్భంగా, విద్యార్థి డాట్ కాం వ్యవస్థాపకుడు మరియు సీఇఓ శ్రీ సుధాకర్ రెడ్డి మూడే గారు ముఖ్య అతిథిగా హాజరై వ్యవస్థాపకత- సవాళ్లు" అనే అంశంపై ప్రభావవంతమైన ప్రసంగాన్ని అందించారు. తన స్వంత వ్యాపార ప్రయాణాన్ని పంచుకుంటూ, విద్యార్థులు కొత్త ఆవిష్కరణలను స్వీకరించాలని, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనాలని, మరియు తమ లక్ష్యాలను నిశ్చయంతో అనుసరించాలని ఆయన ప్రోత్సహించారు.సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు గారు సభను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఈ తరహా పరిశ్రమలోని ప్రముఖులతో జరిగిన సంభాషణలు విద్యార్థులలో అనుభవాన్ని పెంపొందిస్తాయి మరియు వారిని వాస్తవ ప్రపంచానికి సిద్ధం చేస్తాయి. తుది సంవత్సరం విద్యార్థులందరికీ మెరుగైన భవిష్యత్తు కోరి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను," ఎంసిఏ విభాగాధిపతి డా. బి. ఇందిరా గారు విద్యార్థులను ఆశీర్వదిస్తూ, "మీ విజయాలు, ఎదుగుదలపై మాకు గర్వంగా ఉంది. ధైర్యంగా ముందుకు సాగండి మరియు సీబీఐటీకి పేరు తెచ్చేందుకు ప్రయత్నించండి," అన్నారు.ఫ్యాకల్టీ సభ్యుడు డా. జి.ఎన్.ఆర్. ప్రసాద్ గారు విద్యార్థులకు ఓ అందమైన తెలుగు కవితతో శుభాకాంక్షలు తెలిపారు. ఇతర బోధన సిబ్బంది తమ జ్ఞాపకాలను పంచుకుంటూ, విద్యార్థుల విద్యా ప్రయాణం, సృజనాత్మకత, మరియు విభాగ కార్యకలాపాలలో వారి చురుకైన పాల్గొనడం గురించి మాట్లాడారు.తుది సంవత్సరం విద్యార్థులు కూడా భావోద్వేగంతో తమ అనుభవాలను పంచుకున్నారు. అధ్యాపకులు, సిబ్బంది, సీనియర్లు, జూనియర్లు అందరికీ తమ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం ఎంసిఏ 2023%-%25 బ్యాచ్‌కు హృదయపూర్వక వీడ్కోలుతో ముగిసింది. వారు జ్ఞానం, జ్ఞాపకాలు, మరియు ధైర్యంతో కొత్త మార్గాల్లో ప్రయాణం ప్రారంభించనున్నారు.శ్రీ సుధాకర్ రెడ్డి మూడే గారికి ఆయన విలువైన సమయం మరియు ప్రేరణాత్మక హాజరుకు సీబీఐటీ కృతజ్ఞతలు తెలియజేస్తుంది.

# ధనుర్ భాణ రామాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించిన.... ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్



రామగుండం మండలం రిపోర్టర్- తిరు, (శుభోదయం న్యూస్) : రామగుండం బి- పవర్ హౌస్ రహదారి సమీపంలో ఇటీవల వెలసిన ధనుర్ భాణ రామాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణ పనులను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి పరిశీలించారు. సందర్భంగా కొండపై ఇటీవల బయటపడిన ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఇదే స్థలంలో నిర్మాణం జరుగుతున్న 108 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. నిర్మాణం చేస్తున్న సదరు కాంట్రాక్టర్ ను కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాముని కొండపై గతంలో బయటపడిన ధనుర్ భాణ ఆంజనేయస్వామి చిన్నపాటి విగ్రహం ప్రాంతంలోనే ఈ భారీ విగ్రహానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆధ్యాత్మిక చింతనలో ఉండాలన్నారు. అదేవిధంగా ఆంజనేయస్వామి దయతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు త్వరలోనే భారీ విగ్రహం రాముని గుండాల గుట్టపై రూపుదిద్దుకుంటుందని అన్నారు. ఇది తెలంగాణ ప్రాంతం లోనే ఆంజనేయ స్వామి విగ్రహం మణి మకుటం గా మారుతుందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.



# 21న జరిగే ఉద్యమకారుల ప్లీనరీకి బయలుదేరనున్న సైకిల్ యాత్ర



కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్ )ఏప్రిల్-19: ఉదయం 8:00 గంటలకు కరీంనగర్ లో ని మంకమ్మతోట హనుమాన్ టెంపుల్ నుండి హైద్రాబాద్ లో జరుగబోయే ఉద్యమ కారుల ప్లినరికి సైకిల్ యాత్ర ప్రారంభం చేయిస్తున్నట్టు. కరీంనగర్ ఉద్యమకారుల ఫోరం జిల్లా చేర్మెన్ కనకం కుమారస్వామి పేర్కొన్నారు. ఈ సందర్బంగా కుమారస్వామి మాట్లాడుతూ. ఈ యాత్ర రాష్ట్ర ప్రచార కార్యదర్శి కుడిది శ్రీనివాస్. నిర్వహించడం గొప్ప కార్యక్రమం మరియు గతంలో కూడా 16 రోజులు 16 ఆలయాలు ఉద్యమకారుల ఆశయం నెరవేరాలని వారు యాత్ర చేయడం జరిగింది. ఇప్పుడు కరీంనగర్ నుండి హైదరాబాద్ ప్లినరికి సైకిల్ యాత్ర తొ రావడం ఉద్యమకారుల కి మరింత ఉత్సాహం నింపుతుంది ఐక్యత చాటుతుంది ఈ ప్లినరిని విజయవంతం చేయాలని వారు పిలుపునివ్వడం జరిగింది.

# కల్తీకల్లు పై అవగాహన సదస్సు



బీర్కూరు, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): ఇటీవల బీర్కూర్ మండల మరియు అసురుల్లాబాద్ మండల పరిసర గ్రామాల్లో కృత్రిమ కల్తీ కల్లు తాగి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే ఈ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్లగానే సంబధిత అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి కఠిన ఆదేశాలు జారీ చేశారు, ప్రస్తుతం అధికారులు పలు గ్రామాల్లో కల్తీ కల్లు పైన అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు పరంగేడికి, కిస్టాపూర్, బీర్కూర్ గ్రామాల్లో కల్తీకల్లు పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ, ఆరోగ్యశాఖ అధికారులు ఈ కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, ఎక్సైజ్ ఎస్సై నరసింహులు, ఏఎన్ఎం కావ్య,సెక్రెటరీ గురునాథ్, గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అందరూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర నిర్మాణానికి కృషి చేయాలి



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : ఆరోగ్యవంతమైన స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టిన క్రమంలో అందరూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర నిర్మాణానికి కృషి చేయాలని మండల తెలుగుదేశం నాయకుడు గొంటు సుమంత్ రెడ్డి అన్నారు. శనివారం రెంటచింతలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధులు, పారిశుద్ధ్య కార్మికులు ర్యాలీ చేపట్టి పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమ నిర్వహణలో భాగంగా రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించి రహదారులను శుభ్రపరిచారు. ర్యాలీని ఉద్దేశించి సుమంత్ రెడ్డి మాట్లాడుతూ అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతి నెల మూడో శనివారం చేపడుతున్న పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించే స్వచ్ఛత కోసం అందరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కోసం ఇచ్చిన పిలుపును అందరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజినీ దేవి, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలనే కార్యక్రమం



దోర్నాల మండల రిపోర్టర్ ఆవులయ్య ( శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలంలోఈ రోజు మండల విద్యా శాఖ అధికారి బి. మస్తాన్ నాయక్ గారి ఆధ్వర్యంలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో భాగంగా ఎంపీపీస్ తిమ్మాపురంమెయిన్ నందు 1వ తరగతి లో చేరేటువంటి విద్యార్థుల వివరాలు తీసుకున్నారు తరువాత ప్రధానోపాధ్యాయులకు మరియు అంగన్వాడీ టీచర్ లతో మాట్లాడుతూ 5ఏజ్ ఉండి ప్రైవేట్ పాఠశాలకు వెళ్లే విద్యార్థుల వివరాలను తీసుకోని, ఆ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని కూడా మన పాఠశాలలో చేర్చుకోవాలి. దీని కోసం అంగనవాడి ఉపాధ్యాయులతో పాటు మీరు కూడా హౌస్ విజిట్ చేయవలసినదిగా కోరడమైనది.అదేవిదంగా మోడల్ స్కూల్స్ మరియు హై స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు మీ గ్రామాలలో ప్రైవేట్ పాఠశాలకు విద్యార్థుల వివరాలను సేకరించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి వచ్చే విద్యాసంవత్సరం నాకు ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలనీ తెలిపారు ఈ కార్యక్రమం లో కాంప్లెక్స్ చైర్మన్ %టా%. అనసూయ దేవి గారు మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలోని పాఠశాలలను సందర్శించి 5సంవత్సరాలనిండిన విద్యార్థుల గృహాలు సందర్శించి కచ్చితంగా ప్రభుత్వపాఠశాల లో ప్రవేశాలు చేపించాలి అని తెలిపారు.. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు %ఎ%.నాథనియేలు %ఎ%.సాయికుమార్ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# సుందరయ్య కాలనీ లో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ



దోర్నాల మండలం రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా, దోర్నాల మండలం,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చింతల, దోర్నాల సబ్ యూనిట్ పరిధి లోని దోర్నాల -1 సచివాలయం లోని సుందరయ్య కాలనీ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు జిల్లా మలేరియా అధికారి శ్రీ న రే డ్ల మధుసూదనరావు, ప్రకాశం జిల్లా గార్ల ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు."నేను నా పరిసరాల పరిశుభ్రత కొరకు ప్రతి రోజు కొంత సమయం కేటాయిస్తానని , స్వచ్ఛత పై మరియు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి శాస్త్రీయంగా తొలగించటం పై అవగాహన కల్పిస్తానని ప్రమాణం చేస్తున్నాను."సీజనల్ డిసీజెస్ పట్ల మరియు వడదెబ్బ గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలోదోర్నాల సబ్ యూనిట్ ఆఫీసర్ సి హెచ్. రమేష్ బాబు, మలేరియా సూపర్వైజర్ కందుల ఇశ్రాయేలు , ఆరోగ్య కార్యకర్త నాగలక్ష్మి,యం. యల్. హెచ్.పి. సౌజన్య, ఆశా కార్య కర్త,అంగన్వాడీ కార్యకర్త,ఆయా, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ



ఉమ్మడి గుంటూరు జిల్లా,బ్యూరో చీఫ్ ఉప్పాల మురళి,(శుభోదయం న్యూస్): బాపట్ల పట్టణంలోని బెస్తపాలెంలో శ్రీ కోదండ రామాలయంలో శ్రీ రామ నవమి సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నవితరణ చేసిన బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు,చాపా సోమయ్య శేషు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌత లచ్చన్నకు ఘన నివాళులు : టిడిపి నాయకులు



ఉమ్మడి గుంటూరు జిల్లా,బ్యూరో చీఫ్ ఉప్పాల మురళి, (శుభోదయం న్యూస్): సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా బాపట్ల పట్టణంలోని చీల్ రోడ్ సెంటర్లో ఉన్న వారి విగ్రహానికి పూర్ణమాలలు వేసి నివాళులర్పించిన బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసామిరెడ్డి,బావుడా చైర్మన్ చిలకల రాజశేఖర్ బాబు, నియోజకవర్గ సమన్వయకర్త నామల వెంకట శివన్నారాయణ, బాపట్ల పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు,బాపట్ల మండల పార్టీ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ గౌత లచ్చన్న వర్ధంతి వేడుకలు ఘనంగా జై గౌడ ఉద్యమ నాయకులు





ఉమ్మడి గుంటూరు జిల్లా,బ్యూరో చీఫ్ ఉప్పాల మురళి, (శుభోదయం న్యూస్): బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం పెద్దపులివర్రు గ్రామంలో కీ.శే. డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 20వ వర్ధంతి సందర్భంగా అసోసియేటెడ్ రాష్ట్ర అధ్యక్షులు. విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం పరిశ వెంకటేశ్వరరావు గౌడ్ ఆధ్వర్యంలో జై గౌడ్ ఉద్యమం నాయకులు కొనకాల శ్రీనివాసరావు గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈకార్యక్రమంలో అసోసియేటెడ్ రాష్ట్ర అధ్యక్షులు. విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం పరిశ వెంకటేశ్వరరావు గౌడ్, జై గౌడ్ ఉద్యమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు చిట్టిబొమ్మ కిషోర్ గౌడ్, వీరమల్లు కార్తీక్ గౌడ్ గ్రామ గౌడ పెద్దలు బీసీ కులాల నాయకులు విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు తదితరులు ఘనంగా నివాళులర్పించడం జరిగింది.

## జొన్న కొనుగోలు-మట్టినమూనాల సేకరణపై అవగాహన కార్యక్రమం.



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): జిల్లా పరిధిలోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో జొన్న కొనుగోలు మట్టి నమూనాల సేకరణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఏవో ప్రసాదరావు. ఏవో ప్రసాదరావు మాట్లాడుతూ మండలంలోని రైతు సోదరులు 2024 -25 రబి సీజన్లో 4403 ఎకరాలలో జొన్న పంటను సాగు చేశారని, సాగుచేసిన జొన్న పంటను సివిల్ సప్లయిస్ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాలలో కనీస మద్దతు ధర ఒక క్వింటాలకి 3371 రూపాయలతో కొనుగోలు చేయడం జరుగుతుందని, ప్రభుత్వానికి జొన్నలు విక్రయించాలనుకున్న పంటను నమోదు చేసుకొని చేసుకున్న రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.. నంద్యాల మండలం లో మొత్తం 613 మట్టి నమూనాలు సేకరించాలని మట్టి నమూనా సేకరణ ప్రక్రియను రైతు సేవా కేంద్ర సిబ్బంది త్వరగా మట్టి నమూనా లు సేకరించాలని తెలియజేశారు.

## గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు షెడ్యూల్




(శుభోదయం న్యూస్) : ఉదయం 10:30 గంటలకు పిడుగురాళ్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించే వేడుకల్లో పాల్గొంటారు.ఉదయం 11:00 గంటలకు పిడుగురాళ్ల పట్టణంలోని భవనాశి వారి కళ్యాణ మండపం నందు "కొలిశెట్టి మాధవ(అబ్బిశెట్టి) - శ్రీమతి పద్మావతి" గార్ల కుమార్తె వెంకట గాయత్రి వివాహమునకు విచ్చేస్తారు.ఉదయం 11:30 గంటలకు మాచవరం మండలం, మాచవరం గ్రామంలోని మునసుబు గారి కళ్యాణమండపం నందు "యెలిశెట్టి నాగేశ్వరరావు - శ్రీమతి మన్నెమ్మ" గారి కుమార్తె చిరంజీవి బ్రాహ్మణి పుష్పాలంకరణ కార్యక్రమానికి విచ్చేస్తారు.

## లక్ష్మీ బాలాజీ మైన్స్ అండ్ మినరల్స్ నూతన వాహనాల పూజా కార్యక్రమంలో పాల్గొన్న దారపనేని



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలోని లక్ష్మీ బాలాజీ మైన్స్ అండ్ మినరల్స్ నూతన వాహనాల పూజా కార్యక్రమం మాలకొండలో వెలసి ఉన్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని లక్ష్మీ బాలాజీ మైన్స్ అండ్ మినరల్స్ వడ్లమూడి నాగేంద్రబాబు, పువ్వాడి రాంబాబులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దారపనేని మాట్లాడుతూ లక్ష్మీ బాలాజీ మైన్స్ అండ్ మినరల్స్ అధినేతల వ్యాపార అభివృద్ధి దిగ్విజయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాకర్ల బాబురావు, నాదెండ్ల మనీ, వేద పండితులు చిమట కార్తీక్ స్వామి పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణ వివాహ వేదికను వినియోగించుకోండి



చీరాల, శుభోదయం న్యూస్: ఒంగోలులో పద్మావతి ఫంక్షన్ హాల్ లో మే 4వ తారీకు ఆదివారం జరుగు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయి బ్రాహ్మణ ఉద్యోగుల ,సాంస్కృతిక ,సంక్షేమ సంఘం ఒంగోలు వారిచే 5 ఉచిత వివాహ పరిచయ వేదికను వినియోగించుకోవాలని పిలుపునిచ్చిన డాక్టర్ హైమ సుబ్బారావు మరియు డాక్టర్ తాడివలస దేవరాజు.చీరాల హైమ హాస్పిటల్ ఆవరణలో ఉచిత వివాహ వేదిక కరపత్రాన్ని ప్రారంభించిన డాక్టర్ హైమ సుబ్బారావు మరియు డాక్టర్ తాడివలస దేవరాజు ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు డాక్టర్ దేవరాజు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా మూడు వేల మందికి పైగా ఉచితంగా వివాహ వేదిక ద్వారా వివాహాలు చేసినటువంటి వివాహ పరిచయ వేదిక నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ వధూవరుల కోసం ఎదురుచూస్తున్నటువంటి తల్లిదండ్రులు మరియు వాళ్ళ పిల్లలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కన్వీనర్ నాదెండ్ల రాఘవ మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాల నుండి గత ఐదు సంవత్సరాలుగా ఎంతోమంది ఈ వివాహ వేదిక కార్యక్రమంలో పాల్గొంటున్నారని , నాయి బ్రాహ్మణ తల్లిదండ్రులకు వధూవరుల పరిచయం మాది, నిర్ణయం మీది అని తెలిపారుఈ కార్యక్రమంలో ఉచిత వివాహ వేదిక కన్వీనర్ నాదెండ్ల రాఘవ, పోతకమూరి మధుబాబు, మార్కాపూరాం వెంకట రామారావు పాల్గొన్నారు.

## గంగాభవాని ఆలయంలో "మహాపూర్ణాహుతి"



సిద్ధవటం మండల విలేకరి జాకీర్ హుస్సేన్( శుభోదయం న్యూస్): గ్రామపంచాయతీ బంగారుపేటలో వెలసిన శ్రీ గంగాభవాని అమ్మవారి 33 వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.అందులో భాగంగా రెండవ రోజు శనివారం అమ్మవారికి ఉదయం గణపతి హోమం రుద్రస్వాహాకారహోమం - లక్ష్మీసహస్రనామ హోమము- వాస్తు, సర్వతోభద్రమండల హోమములు - శ్రీసూక్త -సరస్వతీ అష్టోత్తర శతనామహోమం దుర్గా- సరస్వతీ సూక్త హోమములు - నవగ్రహ చండీహోమము - దేవి సూక్త హోమము ౧ శాంతి హోమము - దిగ్బలి కూష్మాండ బలి. ప్రధానము."మహాపూర్ణాహుతి" - కుంభాజల ప్రోక్షణం,మంగళ హారతి - మంత్రపుష్పం మహదాశీర్వచనము.పూజలు జరిగాయి.అనంతరం భారీగా అన్న సంతర్పణ జరిగింది.ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.కార్యక్రమంలో ఆలయ ట్రస్టు ఫ్యామిలీ ట్రస్ట్ అధ్యక్షుడు మాడా పెద్ద సుబ్బరాయుడు రామకృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ జన్మదిన వేడుకలు నిర్వహించిన పిడుగు శ్రీనివాసులు



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి మాజీ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ దర్శి రాము జన్మదిన వేడుకలు వార్డ్ మెంబర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి చాలువతో సత్కరించి ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో వాయినేని రాఘవ, తడికమల్ల సుబ్బారావు, మస్తాన్,మధు, కావేరి రసూల్, ఒంగోలు చిట్టిబాబు, అస్లిం, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో సన్మానించిన టిడిపి నాయకులు



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు ముక్కు ఉగ్రన్న గారి సహకారంతో! పామూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్స్ గా నర్సింగ్ సాంబశివరావు, యస్.కె మౌలాలి (మోబిన) నియమితులైన సందర్భంగా! మండల టిడిపి యస్. సి. సెల్ అధ్యక్షుడు డోల శేషు గారి ఆధ్వర్యంలో సన్మానించారు.ఈ కార్యక్రమంలో.మాలకొండయ్య,మండ్ల రమణయ్య, యస్.కె హాజీ గౌస్,శేషం మోషే,క్రిష్ణ మోహన్,హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేసిన మండల అధ్యక్షులు పువ్వాడి



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): ఈస్టర్ పండుగ సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులందరికీమ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ శుభ సందర్భంగా అందరికీ ఆనందం, శాంతి మరియు ప్రేమ లభించాలని కోరుకుంటున్నానని అన్నారు.ఈస్టర్ అనేది యేసు క్రీస్తు పునరుత్థానం యొక్క గుర్తని ఇది మనందరికీ కొత్త ఆశ మరియు విశ్వాసం నింపుతుందని అన్నారు.ఈస్టర్ మనకు ప్రేమ మరియు శాంతి యొక్క సందేశాన్ని ఇస్తుందని ఈ సందేశాన్ని మనం అందరితో పంచుకోవాలని కోరారు.

## లాడ్జిలు హెూటల్ పై ఆకస్మిక తనిఖీ నిర్వహించిన పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): శనివారం సాయంత్రం పట్టణంలోని లాడ్జిలు, హెూటల్స్ ను తనిఖీ చేసి వాటి యజమానులకు పలు సూచనలు చేసిన పామూరు సిఐ భీమా నాయకు పట్టణంలో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే మరియు ముఖ్యంగా వైట్ షిఫ్ట్ డిజైర్ వాహనం లో దొంగలు సంచరిస్తున్నట్లు సమాచారం అందుతున్న క్రమంలో అలాంటి వాహనం పట్ల పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా అనుమానం వస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందివ్వాలని ఆయన సూచించారు.

## దేవస్థాన భూమిని సొంత భూమిగా చూపించి కాజేసిన అక్రమార్కులు



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ ( శుభోదయం న్యూస్) : పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల సమీపంలో సర్వే నంబర్ 180/7 - 1.06 ఎకరాలు, 173/4 - 0.64 సెంట్లు, 173/1 - 0.70 సెంట్ల శ్రీ భుజంగేశ్వర స్వామి దేవాలయ భూములకు సర్వే నిర్వహించిన అధికారులు.ఆక్రమణలను గుర్తించి చట్టపరమైన చర్యలతో భూములు దేవాలయానికి చెందే విధంగా ఈవో శ్రీ గిరిరాజు నర్సింబాబు కృషి.

## స్వచ్ఛంధ్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన

:నార్పల మండలం చింతవనం 1వ అంగన్వాడి కేంద్రంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది . కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ సునాలిని మాట్లాడుతూ.. ప్రతి నెల మూడో శనివారం జరిగే ఈ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఎంతో ఉపయోగకరం అన్నారు ముందుగా మన ఇంటిని మన ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే మన వీధి మన గ్రామం స్వచ్ఛ గ్రామంగా విలసిల్లుతుంది తద్వారా మన జిల్లా మరియు మన రాష్ట్రం కూడా స్వర్ణ ఆంధ్రగా రూపుదిద్దుకుంటుంది కనుక ప్రతి ఒక్కరు తన వంతు కృషిగా మన ఇంటిని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అలాగే చెట్లను నాటి పచ్చదనాన్ని కూడా పెంచాలని చెప్పారు అనంతరం స్వర్ణాంధ్ర కొరకు ప్రతిజ్ఞ చేశారు, కార్యక్రమంలో సూపర్వైజర్లు సునాలిని, మధుమాలిని, అంగన్వాడీ కార్యకర్తలు తల్లులు కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

శుభోదయం

సంపాదకీయం

# చల్లటి కబురు!

## (విశ్లేషణ)

భానుడు ఉగ్రరూపం దాల్చే ఏప్రిల్ నెలలోనే ప్రాణం కుదుటపడేలా జూన్‌లో ఆగమించే నైరుతి రుతుపవనాల తీరుతెన్నులు చెప్పడం మన వాతావరణ సంస్థలకు అలవాటు. ఈసారి భారతీయ వాతావరణ విభాగం(ఐఎండీ) ప్రకటించినదాన్నిబట్టి సాధారణ వర్షపాతంకన్నా అధికంగానే వానలు పడొచ్చు. అంతేకాదు... వర్షాభావానికి దారితీసి కరువు కాటకాలకు కారణమయ్యే ఎల్ నినో బెడద కూడా ఉండకపోవచ్చని కూడా ఆ విభాగం తెలియజేసింది. అయితే వాతావరణ స్థితి గతులను అంచనా వేసే మరో సంస్థ స్కైమెట్ మాత్రం 'సాధారణ' స్థాయిలోనే రుతుపవనాలుంటాయని చెబుతోంది. ఈ నెల మొదట్లోనే ఇందుకు సంబంధించిన లెక్కలు ప్రకటించి, సాధారణంకన్నా అధికంగా వర్షాలు పడే అవకాశం 30 శాతం మాత్రమే ఉన్నదని తెలిపింది. నైరుతి రుతు పవనాలు సాధారణంగా జూన్ 1న ప్రవేశించి చకచకా విస్తరించుకుంటూపోయి సెప్టెంబర్ మధ్య కల్లా నిష్క్రమిస్తాయి. దేశ జనాభాలో 42.3 శాతం మందికి జీవనాధారమైన వ్యవసాయం పూర్తిగా రుతుపవనాలపై ఆధారపడి వుంటుంది. అది సక్రమంగా వచ్చి వెళ్తే దేశం కళకళలాడుతుంది. మందగమనంతో అడుగులేస్తే, అంతంతమాత్రంగా ముగిసిపోతే అనేక సమస్యలకు దారితీస్తుంది. మన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో వ్యవసాయం వాటా 18.2 శాతం. అయితే 'వాన రాకడ... ప్రాణం పోకడ ఎవరికీ తెలియద'న్న నానుడి మరిచిపోకూడదు. వర్షపాతం బాగుంటుందన్నా, అది అధికంగా ఉండొచ్చని చెప్పినా దేశవ్యాప్తంగా అన్నిచోట్లా అదే మాదిరిగా ఉంటుందని ఆశించలేం. స్థానిక కాలమాన పరిస్థితులనుబట్టి కొన్నిచోట్ల అధిక వర్షపాతం, మరికొన్నిచోట్ల అవసరమైన దానికన్నా తక్కువగావుండొచ్చు. బ్రిటిష్ వ్యంగ్య రచయిత జెరోమ్ కె. జెరోమ్ ఒక సందర్భంలో చెప్పినట్టు వాతావరణం అనేది ప్రభుత్వం వంటిది. అదెప్పుడూ చెడ్డగానే ఉంటుంది! ఎక్కడో భూమధ్య రేఖకు ఆనుకునివున్న పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడివున్న వర్తమాన వాతావరణ పరిస్థితులు మన రుతుపవనాలను నిర్దేశిస్తాయి. పసిఫిక్ మహాసముద్ర ఉపరితలంపై, ముఖ్యంగా దక్షిణమెరికా తీర ప్రాంతంవైపు ఉష్ణోగ్రతలు అధికంగావుంటే గాలిలో తేమ శాతం పెరిగి ఎల్ నినో ఏర్పడి రుతుపవనాలు బలహీనపడతాయి. వర్షాలు లేక కరువుకాటకాలు విజృంభిస్తాయి. ఆ ఉష్ణోగ్రతలు తక్కువుంటే లానినా ఏర్పడి కుంభవృష్టికి దారితీసి వరదల బెడదవుంటుంది. ప్రస్తు తానికి అక్కడ తటస్థ పరిస్థితులున్నాయంటున్నారు. ఒక్కోసారి మన హిందూ మహాసముద్రంపై ఆవరించివుండే మేఘాల స్థితిగతులు, ఆ వాతావరణంలోవుండే గాలి తుంపరలు, మనకుండే అటవీ సాంద్రత వంటివి ఎల్ నినోను ప్రభావితం చేస్తాయి. ఈ కారణంవల్లనే పసిఫిక్ మహాసముద్రంలో ఎల్ నినో ఏర్పడినా ఒక్కోసారి మన రుతుపవనాలు సజావుగా వచ్చివెళ్తాయి. అందుకే ఎల్ నినో గురించి పట్టించుకోవటం, రుతుపవనాలను ముందుగా అంచనా వేయటం అశాస్త్రీయం అంటారు కొందరు శాస్త్రవేత్తలు. ఎల్ నినోను నియంత్రించే ఇతరేతర పరిస్థితులు అనేకం ఉన్నప్పుడు దాని ఆధారంగా వర్షాల గురించి అంచనా వేయటం వృథా ప్రయాస అని వారి భావన. వర్షరుతువులో ఏటా వర్షపాత సగటు(ఎల్‌పీఏ) ఎంతవుంటున్నదో లెక్కేయటం ఐఎండీ పని. ఆ సగటు దీర్ఘకాలంలో ఎంతవుందో గణించి, దానికన్నా ఎంత ఎక్కువగా లేదా ఎంత తక్కువగా వర్షాలు పడే అవకాశం వుందో తెలియజేస్తారు. ఎల్‌పీఏను 87 సెంటీమీటర్ల వర్షపాతంగా గణించి, ఈసారి వర్షాలు దీన్నిమించి 105 శాతంవరకూ ఉండొచ్చని అంచనా కట్టారు. నిరుడు మొదట్లో 106 శాతం అధిక వర్షపాతం అంచనా వేయగా, అది 108 శాతం వరకూ పోయింది. ఎల్‌పీఏ 96 శాతంకన్నా తక్కువుంటే సాధారణంకన్నా తక్కువ వర్షపాతంగా లెక్కేస్తారు. 96-104 మధ్యవుంటే సాధా రణ వర్షపాతంగా, 104-110 శాతం మధ్యవుంటే అధిక వర్షపాతంగా పరిగణిస్తారు. ఐఎండీ 105 శాతంవరకూ ఉండొచ్చని అంచనా వేయగా, స్కైమెట్ మాత్రం 103 శాతానికి పరిమితమైంది. మన దేశంలో సాగుకు యోగ్యమైన భూమిలో 60 శాతంవరకూ వర్షాధారమే. కనుక వర్షాలు సమృద్ధిగా పడితేనే మన సాగురంగం బాగుంటుంది. అందరికీ పనులు దొరికి సుఖసంతోషాలతో వుంటారు. ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. వర్షపాతం అంచనాలు సక్రమంగావుంటే ఎక్కడ ఎలాంటిపంటలు వేసుకోవచ్చునో, వేటికి అనుకూలతలు ఏర్పడవచ్చునో తెలుస్తుంది. రైతులు నష్టపో కూడదంటే ఇలాంటి అంచనాలు ఎంతో అవసరం. కానీ నిర్దుష్టంగా అంచనాలు చెప్పటం అన్ని వేళలా సాధ్యపడకపోవచ్చు. గతంతో పోలిస్తే వాతావరణ విభాగం అంచనాలు మెరుగ్గా ఉంటు న్నాయి. ఆ రంగంలో పెరిగిన సాంకేతికతలే అందుకు కారణం.వర్షాలు సాధారణంకన్నా ఎక్కువుంటాయని వేసిన అంచనాలు చూసి మురిసిపోలేం. ఎందుకంటే కురిసిన వర్షాన్నంతటినీ ఒడిసిపట్టి తాగునీటి, సాగునీటి అవసరాలు తీర్చుకునే మౌలిక సదుపాయాలు మనదగ్గరుండాలి. తొలకరినాటికల్లా సాగుపనుల కోసం రైతులకు డబ్బు అందు బాటులో వుండాలి. సకాలంలో నాట్లు పడకపోతే పైరు ఎదుగుదల బాగుండదు. భిన్న దశల్లో ఎరువులూ, పురుగుమందులూ దొరకాలి. అన్నిటికన్నా ముందు విత్తనాల లభ్యత సక్రమంగావుండాలి. కల్తీ విత్తనాల బెడద నిరోధించాలి. వీటికోసం ఎలాంటి ముందస్తు చర్యలు అమలు కావాలో, రైతులకు బ్యాంకుల నుంచి రుణసదుపాయాలెలా కల్పించాలో ప్రభుత్వాలు ఆలోచించాలి. రుతుపవనాలు సక్రమంగా ఉండబోతున్నాయని ఐఎండీ ప్రకటించింది కనుక ఇప్పటినుంచే పకడ్బందీ ప్రణాళికలు రూపుదిద్దుకోవాలి.

# అమెరికా విప్లవానికి 250 ఏళ్ల చరిత్ర



అమెరికన్ విప్లవం 250 సంవత్సరాల క్రితం, తుపాకీ కాల్పులతో వలసవాద మలుపుతో ప్రారంభమైంది. లెక్సింగ్టన్, కాన్కార్డ్ యుద్ధాల వార్షికోత్సవంతో శనివారం ప్రారంభమైంది. ట్రంప్ పిలుపునిచ్చినట్లుగా, జూలై 4, 2026 వరకు ఏడాది పొడవునా పార్టీని కలిగి ఉండాలా లేదా మహిళలు, బానిసలు, స్వదేశీ ప్రజలు వారి కథలు ఏమి వెల్లడిస్తాయో ప్రశ్నలతో ఏదైనా వేడుకలను సమతుల్యం చేయాలా అనే దానిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పండిత సమాజం ఇతరులు విభేదిస్తున్నందున సెమీక్విన్సెంటెనియల్ వస్తుంది. మసాచుసెట్స్‌లోని లెక్సింగ్టన్ కాన్కార్డ్ చరిత్ర సగం తెలిసినది, పురాణం లోతుగా పాతుకుపోయింది. 1775 ఏప్రిల్ 19 తెల్లవారుజామున బోస్టన్ నుండి వందలాది మంది బ్రిటిష్ సైనికులు కవాతు చేసి, లెక్సింగ్టన్ పట్టణం గ్రీన్‌లో వాయువ్యంగా 14 మైళ్లు (22.5 కిలోమీటర్లు) గుమిగూడారని పునఃనిర్మాణకర్తలు నమ్మకంగా చెప్పవచ్చు.

తీవ్రంగా మారిన యుద్ధం

ప్రత్యక్ష సాక్షులు కొంతమంది బ్రిటిష్ అధికారులు 'విలన్లారా, తిరుగుబాటుదారులారా, మీ చేతులను కిందకు విసిరేయండి!' అని అరిచారని గందరగోళం మధ్య ఒక కాల్పులు వినిపించాయని, ఆ తర్వాత బ్రిటిష్ వారి నుండి 'చెదురుగా ఉన్న కాల్పులు' వినిపించాయని గుర్తు చేసుకున్నారు. యుద్ధం చాలా తీవ్రంగా మారడంతో ఆ ప్రాంతం మండుతున్న పొడితో నిండిపోయింది. రోజు చివరి నాటికి, పోరాటం కాంకర్డ్‌కు పశ్చిమాన 7 మైళ్లు (11 కిలోమీటర్లు) దూరంలో కొనసాగింది దాదాపు 250 మంది బ్రిటిష్ 95 మంది వలసవాదులు మరణించారు లేదా గాయపడ్డారు.

### ఎందుకు కాల్పులు జరిపారో తెలియదు

కానీ ఎవరు ముందుగా కాల్పులు జరిపారో, ఎందుకు కాల్పులు జరిపారో ఎవరికీ తెలియదు. మరియు విప్లవం మొదట్లో మెరుగైన నిబంధనల కోసం డిమాండ్ కంటే తక్కువ విప్లవం. సౌత్ కరోలినా విశ్వవిద్యాలయంలో ప్రారంభ అమెరికన్ చరిత్ర ప్రొఫెసర్ వుడీ హెూల్టన్ మాట్లాడుతూ, ఏప్రిల్ 1775 నాటి తిరుగుబాటుదారులు సామ్రాజ్యాన్ని విడిచిపెట్టాలని కోరుకోవడం లేదని, కింగ్ జార్జ్ %×××%తో తమ సంబంధాన్ని సరిదిద్దుకోవడానికి మునుపటి దశాబ్దంలోని స్టాంప్ చట్టం, టీ చట్టం ఇతర వివాదాలకు ముందు రోజులకు తిరిగి వెళ్లాలని చూస్తున్నారని చాలా మంది పండితులు అంగీకరిస్తున్నారని చెప్పారు. 'వలసవాదులు గడియారాన్ని 1763కి వెనక్కి తిప్పాలని మాత్రమే కోరుకున్నారు' అని ఆయన అన్నారు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ మరియు శామ్యూల్ ఆడమ్స్ జీవిత చరిత్రలను కలిగి ఉన్న పులిట్జర్ బహుమతి గ్రహీత స్టేసీ షిఫ్, లెక్సింగ్టన్ కాన్కార్డ్ 'మసాచుసెట్స్ పురుషులు ఆశించిన విధంగానే అభిప్రాయాన్ని పునరుజ్జీవింపజేశారు, అయినప్పటికీ స్వాతంత్ర్యం కోసం ఓటు వేయడానికి ఇది చాలా దూరం అవుతుంది, దీనిని ఆడమ్స్ 20 ఏప్రిల్ 1775న ప్రకటించాలని భావించారు' అని అన్నారు.

### ఒక మాతృ దేశం

కానీ ఆ సమయంలో, షిఫ్ ఇలా అన్నాడు, 'ఒక మాతృ దేశం దాని కాలనీ వాస్తవానికి ఘర్షణకు దిగడం సాధ్యం కాలేదు.' తిరుగుబాటుదారులు తమ లక్ష్యాన్ని ప్రజలు పాలకుల మధ్య విభేదం కంటే ఎక్కువగా విశ్వసించారు. 1776 నాటి మలుపులకు ముందే, స్వాతంత్ర్య ప్రకటనకు ముందు లేదా థామస్ పైన్ 'ప్రపంచాన్ని మళ్ళీ ప్రారంభించే శక్తి మనలో ఉంది' అని ప్రగల్భాలు పలికే ముందు, వారు యుగాలకు ఒక నాటకంలో నటించారు. మసాచుసెట్స్‌లోని సఫోల్క్ కౌంటీ పౌర నాయకులు రూపొందించిన 1774 నాటి సఫోల్క్ రిజల్యూషన్స్ అని పిలవబడేవి. 'ఈ కొత్త ప్రపంచం యొక్క విధిని పుట్టబోయే లక్షలాది మంది విధిని' నిర్ణయించే పోరాటం 'శక్తితో బంధించబడని, సంకెళ్లతో బంధించబడని' జీవితం కోసం ప్రార్థించాయి. విప్లవం ఆశ్చర్యం మెరుగుదల యొక్క కొనసాగుతున్న కథ. లెక్సింగ్టన్, కాన్కార్డ్ 'స్వదేశీ జట్టుకు స్పష్టమైన విజయం' అని పిలిచిన సైనిక చరిత్రకారుడు రిక్ అట్కిన్సన్, యుద్ధంపై ప్రణాళికాబద్ధమైన త్రయంలో రెండవది, బ్రిటిష్ వారు కాలనీ మిలీషియా నుండి అలాంటి ఉద్రేకపూరిత ప్రతిఘటనను చరిత్రను ఘనంగా జరుపుకోవడమే కాక, అందులోని అవిశ్లేషిత మూలాల్ని, ఆవిష్కరించబడని గొంతుల్ని వినేందుకు ఇది సంభావ్యమైన అవకాశం.

# త్వరలో కేంద్రంలో కీలక పరిణామాల దిశగా సంకేతాలు.. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ?



ఢిల్లీ రాజకీయాలు అసక్తి రేకెత్తిస్తున్నాయి. అతి త్వరలోనే కేంద్రంలో కీలక పరిణామాల ఉండబోతున్నాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి. చట్టాల ఆమోదం విషయంలో రాష్ట్రపతికి సుప్రీంకోర్టు కాల పరిమితి విధించిన అంశంతో పాటు కేంద్ర కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ, బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన, భారతీయ జనతా పార్టీకి కొత్త అధ్యక్షుడి ఎన్నిక, పార్టీలో సంస్థాగత మార్పులు సహా పలు కీలక అంశాలపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వీటికి తోడు కేబినెట్ భేటీ జరగకపోవడం, ప్రధానిని రాష్ట్రపతిని కలవడం, బీజేపీ, కేంద్ర ప్రభుత్వ ముఖ్యుల వరుస సమావేశాల నేపథ్యంలో ఏదో జరగబోతుంది అంటూ రాజకీయంగా పెద్ద ఎత్తున ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఊహాగానాలకు మరింత ఊతమిచ్చేలా గత బుధవారం(ఏప్రిల్ 16) కేబినెట్ జరగకపోగా వచ్చేవారం కూడా కేంద్ర కేబినెట్ భేటీ సమావేశం జరగడం లేదని తెలుస్తోంది. కేంద్రంలోని బీజేపీ అగ్ర నేతలు ప్రధానమంత్రి నురంద మోడీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, బిఎల్ సంతోష్ ఉమ్మడిగా విడివిడిగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. గత మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు ప్రధాని మోదీ. ప్రస్తుతం బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఎన్నిక, సంస్థాగతంగా పార్టీలో మార్పులపై దృష్టి సారించిన అధిష్టానం కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై కూడా ఆలోచన చేస్తున్నట్లు పార్టీలో చర్చ జరుగుతుంది. కేబినెట్, పార్టీ వ్యవస్థాగత పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కొందరు యువ నేతలకు కీలక బాధ్యతలు అప్పజెప్పవచ్చంటూ బీజేపీ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. రానున్న బీహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఆయా రాష్ట్రాల నేతలకు కేంద్ర కేబినెట్‌లో చోటు కల్పించే అవకాశం వుందని భావిస్తున్నారు. ఇంతకాలం తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసిన అన్నామలైను కేంద్ర కేబినెట్‌లోకి తీసుకుంటారని ఇప్పటికే విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా వచ్చే వారం నూతన బీజేపీ జాతీయ అధ్యక్ష ప్రకటన ఉండే అవకాశం ఉంది. ఇప్పటివరకు 14 రాష్ట్రాలకు బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుల ప్రకటన పూర్తయింది. జాతీయ అధ్యక్షుడి ఎంపికకు ముందే కనీసం మరో ఐదు లేదా ఆరు రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించే అవకాశం ఉంది. పార్టీ అధ్యక్షులను నియమించాల్సిన రాష్ట్రాల్లో మధ్య ప్రదేశ్, గుజరాత్, ఉత్తర ప్రదేశ్, కర్నాటక, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, హర్యానా, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా సహా పలు రాష్ట్రాలున్నాయి. పార్టీ బలోపేతంలో భాగంగా బీజేప జాతీయ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులుగా యువ నాయకత్వాన్ని ప్రోత్సహించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు పశ్చిమ బెంగాల్ ముర్షిదాబాద్ లో హింస కారణంగా రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన దిశగా కేంద్రం అడుగులు అవకాశం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది..దీనితో పాటు రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించి, పంపించిన బిల్లులు విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదం తెలిపే విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తదుపరి ఏ విధంగా ముందుకు వెళ్ళాలన్న దానిపైనా కేంద్ర ప్రభుత్వ, బీజేపీ ముఖ్యులు చర్చిస్తున్నట్లు సమాచారం.!

# విద్యార్థులకు వేసవి సెలవులు ఓ సదవకాశం



వేసవికాలం విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఒక విశిష్టమైన సమయం. వేసవిలో పాఠశాలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులకు స్వేచ్ఛ లభిస్తుంది. అదే సమయంలో తల్లిదండ్రులకు తమ పిల్లలతో సమయం గడపడానికి, వారి భవిష్యత్తును ఆలోచించడానికి అవకాశం ఏర్పడుతుంది. వేసవి సెలవులు విద్యార్థులకు విశ్రాంతిని, వినోదాన్ని, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికి అవకాశాన్ని అందిస్తాయి. అయితే, తల్లిదండ్రులకు ఈ సమయం తమ పిల్లల అభివృద్ధిలో కీలకమైన బాధ్యతను గుర్తు చేస్తుంది. అందుకే విద్యార్థులు, తల్లిదండ్రులు ఒక నిర్దిష్టమైన లక్ష్యాలను ఈ సెలవుల కోసం పెట్టుకోవాలి. నేను ఈ సెలవుల్లో ఏమి నేర్చుకోవాలి? నేను కొత్తగా ఏమి అభివృద్ధి చేసుకోవాలి? అనే ప్రశ్నలకు సమాధానాల శోధనలో ఉండాలి. సెలవులు ముగిసే సరికి ఒక మంచి మార్పు రావాలి. అది జ్ఞానంలో కావొచ్చు, నైపుణ్యంలో కావొచ్చు లేదా వ్యక్తిత్వ వికాశంలో కావొచ్చు. వేసవి సెలవులు విద్యార్థులకు ఒక బహుమతి. సంవత్సరం పొడవునా అధ్యయన ఒత్తిడి, హెూం వర్క్, పరీక్షలతో బిజీగా గడిపే విద్యార్థులకు ఈ సెలవులు విశ్రాంతిని అందిస్తాయి. ఈ సమయంలో వారు తమ ఆసక్తులను అన్వేషించవచ్చు. కొత్త హాబీలను అభివృద్ధి చేసుకోవచ్చు, స్నేహితులతో సమయం గడపవచ్చు. ఉదాహరణకు, కొందరు విద్యార్థులు ఈ సమయంలో సంగీతం, నృత్యం, చిత్రకళ వంటి కళలను నేర్చుకుంటారు, మరికొందరు క్రీడలలో పాల్గొంటారు. జట్టుగా కలిసి ప్రాజెక్టు చేయడం, సైంటిఫిక్ ఎగ్జిబిషన్లు సిద్ధం చేసుకోవడం, ఆన్‌లైన్ కోర్సుల ద్వారా కొత్త పరిజ్ఞానం పొందడం, ఈ డిజిటల్ యుగంలో కోడింగ్, గ్రాఫిక్ డిజైన్ కంటెంట్ రైటింగ్‌లపై పట్టు సాధించవచ్చు. ఈ కార్యకలాపాలు వారి సృజనాత్మకతను, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి. అదే సమయంలో వేసవికాలం విద్యార్థులకు విద్యాపరమైన లక్ష్యాలను సమీక్షించడానికి, బలహీనమైన అంశాలను మెరుగుపరచుకోవడానికి కూడా అవకాశం కల్పిస్తుంది. ఉదాహరణకు, గణితంలో బలహీనంగా ఉన్న విద్యార్థి వేసవికాలంలో ట్యూషన్‌లో చేరి తన నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చు. అదే విధంగా సైన్స్‌లో బొమ్మ లు గీయడం నేర్చుకోవడం, ఇంగ్లీష్ మాట్లాడే నైపుణ్యానాలు పెంచుకోవడం. ఫ్రెంచ్, జెర్మనీ లాంగ్వేజ్‌లను నేర్చుకోవడం మంచిది. వేసవి సెలవులు కేవలం వినోదం కోసం మాత్రమే కాదు. విద్యార్థులు ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే తల్లిదండ్రుల పాత్రచాలా కీలకం. తల్లిదండ్రులు తమ పిల్లలకు సరైన మార్గదర్శనం అందించాలి. వేసవి సెలవుల్లో పిల్లలు సమయాన్ని వృథా చేయకుండా, ఉత్పాదక కార్యకలాపాలలో పాల్గొనేలా ప్రోత్సహించాలి. ఉదాహరణకు, తల్లిదండ్రులు పిల్లలతో కలిసి ఒక రోజువారీ షెడ్యూల్‌ను రూపొందించవచ్చు. ఇందులో అధ్యయనం, ఆటలు, విశ్రాంతి సమతుల్యంగా ఉండేలా చూడవచ్చు. అదనంగా, తల్లిదండ్రులు పిల్లలతో కలిసి సమయం గడపడం ద్వారా వారి మానసిక ఆరోగ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించవచ్చు. కుటుంబ సభ్యులతో కలిసి ఒక చిన్న పర్యటనకు వెళ్లడం, గ్రామీణ ప్రాంతాలను సందర్శించడం వంటివి పిల్లలకు కొత్త అనుభవాలను అందిస్తాయి. తల్లిదండ్రులు వేసవి కాలంలో పిల్లలకు కొత్త నైపుణ్యాలను నేర్పించడంలో కూడా పాలుపంచుకోవచ్చు. ఉదాహరణకు, ఒక తండ్రి తన పిల్లలకు సైకిల్ నడపడం లేదా చెక్క పనిని నేర్పవచ్చు, పొలాలు, ప్రకృతి అంశాలు. అదే విధంగా తల్లి వంట, కుట్టు వంటి జీవన నైపుణ్యాలను నేర్పవచ్చు.ఇటువంటి కార్యకలాపాలు పిల్లలలో ఆత్మవిశ్వాసాన్ని, స్వావలంబనను పెంపొందిస్తాయి. అదనంగా తల్లిదండ్రులు పిల్లలను సామాజిక కార్యకలాపాలలో పాల్గొనేలా ప్రోత్సహించవచ్చు. ఉదాహరణకు, స్థానిక సమాజ సేవా కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా పిల్లలు సామాజిక బాధ్యతను నేర్చుకుంటారు.వేసవి కాలంలో ఒక సమస్య ఏమిటంటే, కొందరు విద్యార్థులు సెలవుల సమయాన్ని ఎక్కువగా మొబైల్ ఫోన్‌లు, వీడియో గేమ్‌లతో గడపడం. ఇది వారి ఆరోగ్యంపై, మానసిక స్థితిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఈ సమస్యను అధిగమించడానికి తల్లిదండ్రులు స్క్రీన్ టైమ్‌ను పరిమితం చేయాలి, పిల్లలను బహిరంగ కార్యకలాపాలలో పాల్గొనేలా ప్రోత్సహించాలి. అదనంగా, పిల్లలకు పుస్తకాలు చదవడం, రాత పనులు అలవాటు చేయడం ద్వారా వారి జ్ఞానాన్ని, ఊహాశక్తిని పెంపొందించవచ్చు. తల్లిదండ్రులు పిల్లలతో కలిసి చదవడం ద్వారా ఈ అలవాటును మరింత ఆసక్తికరంగా మార్చవచ్చు. మరోవైపు, వేసవికాలం తల్లిదండ్రులకు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించడానికి అనువైన సమయం. ఈ సమయంలో వారు పిల్లలతో వారి కెరీర్ లక్ష్యాల గురించి చర్చించవచ్చు.వారి ఆసక్తులను అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు, ఒక విద్యార్థి వైద్యరంగంలో ఆసక్తి చూపితే, తల్లిదండ్రులు అతన్ని స్థానిక ఆసుపత్రిలో స్వచ్ఛంద సేవకుడిగా చేర్చవచ్చు. తద్వారా అతను ఆ రంగం గురించి ఆచరణాత్మక జ్ఞానం పొందవచ్చు. పిల్లలను ఒంటరిగా ఈతలకు పంపకూడదు, బైక్ రైడింగ్ చేయించకూడదు, అనవసరమైన విషయాలకు స్నేహితులతో తిరగనీయకూడదు. ఈ విషయాలపట్ల తల్లిదండ్రులు మరింత జాగ్రత్త వహించాలి. పిల్లలకు సరైన మార్గదర్శనం అందించడం ద్వారా పిల్లలకు వారి శారీరక, మానసిక, విద్యాపరమైన అభివృద్ధితో పాటు మరుపురాని అనుభవాలను వారు మూటగట్టుకుంటారు.

## 'మోదీకి దాసోహమైంది మీరు కాదా?'



హైదరాబాద్: దొంగల ముఠాలా రాష్ట్రాన్ని పదేళ్లు దోచుకున్నది మీరంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ధ్వజమెత్తారు. అవినీతి కేసుల నుంచి తప్పించుకోవడానికి బీజేపీతో బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం పెట్టుకున్నదని ఆరోపించారు. 'రాష్ట్రాన్ని పదేళ్లు దోచుకున్న మీరు.. అవినీతి కేసుల నుంచి తప్పించుకోవడానికి బీజేపీతో లోపాయికారీ ఒప్పందం పెట్టుకున్నారు. పదేళ్లలో రాష్ట్రాన్ని దోచుకోవడమే లక్ష్యంగా పనిచేసిన మీరు.. మీ అక్రమాలపై కేంద్రం చర్యలు తీసుకోకుండా నరేంద్ర మోదీకి దాసోహమయ్యారు. మీ బలహీనతలను ఆసరాగా తీసుకున్న బీజేపీ రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన వాటాలను, నిధులను ఇవ్వకుండా అన్యాయం చేసింది. సొంత ప్రయోజనాలకే పెద్ద పీట వేసిన మీరు బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడంతో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడింది. పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రవేశ పెట్టిన బిల్లులకు మద్దతు ఇచ్చింది మీరు కాదా కేటీఆర్, పదేళ్లలో మోదీ తీసుకున్న అనాలోచన నిర్ణయాలన్నింటికీ మద్దతిచ్చిన మీరు ఇప్పుడు కాంగ్రెస్‌ను ప్రశ్నించడం హాస్యాస్పదం. కవితని లిక్కర్ స్కాం నుంచి కాపాడడానికి బీజేపీ కి ఊడిగం చేసిది నిజం కాదా?, బీజేపీకి కట్టు బానిసలా కేటీఆర్ పని చేస్తున్నారు.సంఖ్యా బలం లేని బీజేపీ మీ పార్టీ అండ చూసుకొని పోటీ చేస్తోంది. లోకల్ బాడీ ఎన్నికలో బీజేపీని గెలిపించేందుకే కేటీఆర్ తాపత్రయపడుతున్నారు' అని విమర్శించారు మహేష్ గౌడ్.

## బీఆర్ఎస్ బండారం బట్టబయలు: రాజాసింగ్




హైదరాబాద్: బీఆర్ఎస్ బండారం బయటపడిందని బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యానించారు. ఎంఐఎంను గెలిపించేందుకే లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్‌కు బీఆర్ఎస్ పార్టీ దూరం ఉందని ఆరోపించారు. భాగ్యనగర్‌ను మజ్లిస్‌కు అప్పగించేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయంటూ వ్యాఖ్యానించారు. ఈ మూడు పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందని రాజాసింగ్ ఆరోపణలు గుప్పించారు. భాగ్యనగర్‌లో బీఆర్ఎస్‌ను పాతరేస్తాం. మజ్లిస్‌ను గెలిపిస్తే మీ రాజకీయ భవిష్యత్తు ఖతమైనట్లేనంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్పొరేటర్లను ఉద్దేశించి అన్నారు. ఓటింగ్‌లో పాల్గొనకపోవడమంటే ప్రజాస్వామ్యాన్ని ధిక్కరించినట్లే.. అంతరాత్మ ప్రబోధానుసారం ఓటేయండి అంటూ రాజాసింగ్ చెప్పుకొచ్చారు. కాగా, హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికను బాయ్‌కట్ చేస్తున్నామని.. ఓటింగ్‌కు దూరంగా ఉండాలంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశించారు. విప్ ధిక్కరిస్తే పార్టీ నుంచి బహిష్కరణ తప్పదని హెచ్చరించారు.

## బీఆర్ఎస్ గ్రాఫ్ పెరిగిందా? తగ్గిందా?.. కేటీఆర్ ఏమన్నారంటే



హైదరాబాద్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్‌దే విజయం అంటూ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో హైదరాబాద్ బీఆర్ఎస్ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యధిక స్థానాలు బీఆర్ఎస్ గెలుస్తుందన్నారు. 17 నెలల కాలంలో బీఆర్ఎస్ గ్రాఫ్ బాగా పెరిగిందన్నారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికను బాయ్‌కట్ చేస్తున్నామని.. ఓటింగ్‌కు దూరంగా ఉండాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లను కేటీఆర్ ఆదేశించారు. విప్ ధిక్కరిస్తే పార్టీ నుంచి బహిష్కరణ తప్పదని హెచ్చరించారు. హెచ్‌సీయూ భూ కుంభకోణం వెనుక బీజేపీ ఎంపీ ఉన్నాడంటూ కేటీఆర్ ఆరోపించారు. బీజేపీ ఎంపీలు తెలంగాణకు ఒక్క రూపాయైనా తెచ్చారా? అంటూ ప్రశ్నించారు. హెరాల్డ్ కేసుపై కాంగ్రెస్ నేతలు మాట్లాడుతుంటే.. రేవంత్ ఒక్కమాట కూడా మాట్లాడటం లేదంటూ మండిపడ్డారు. కేసీఆర్ దీక్ష, పోరాటంతోనే తెలంగాణ వచ్చిందన్న.. కేటీఆర్.. బీఆర్ఎస్ సమర్థవంతమైన పాత్ర పోషిస్తుందన్నారు. చేసినవి చెప్పుకోనందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామంటూ కేటీఆర్ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్‌సీయూ, హైడ్రా, మూసీ పేరుతో అరాచకాలు సృష్టిస్తోందని విమర్శలు గుప్పించారు. బీజేపీ ఎంపీలు కాంగ్రెస్‌ను ఒక్క మాట కూడా అనరని.. హెచ్‌సీయూ భూములపై ప్రధాని మోదీ ఎందుకు విచారణ జరిపించడం లేదంటూ కేటీఆర్ ప్రశ్నించారు.

## ఏపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కు హైడ్రా షాక్




హైదరాబాద్: ఏపీ మైలవరం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కు హైడ్రా షాక్ తగిలింది. కొండాపూర్ పరిధిలో ప్రభుత్వ భూముల్లో ఆయన చేపట్టిన అక్రమ కట్టడాలను శనివారం ఉదయం అధికారులు కూల్చేశారు. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టారు. కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయ సమీపంలోని సర్వే నెంబర్ 79లో 39 ఎకరాల స్థల వివాదంపై హైడ్రాకు ఫిర్యాదు అందింది. దీంతో భారీ పోలీసు బందోబస్తు అక్కడికి చేరుకున్న హైడ్రా.. వసంత కృష్ణ ప్రసాద్ కబ్జాల పర్వాన్ని గుర్తించింది. ఆ స్థలం చుట్టూ ఉన్న ఫెన్సింగ్ తోపాటు భారీ షెడ్లను జేసీబీలతో తొలగించింది. కూల్చివేతలను అడ్డుకునేందుకు ఆయన కుటుంబ సభ్యులు ప్రయత్నించగా.. భారీ పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేతలు కొనసాగించింది. ఈ క్రమంలో వసంత హౌస్ పేరుతో ఏర్పాటు చేసిన ఆఫీస్‌తో పాటు భారీ షెడ్లను తొలగించారు. హఫీజ్‌పేటలో రూ. 2000 కోట్ల విలువగల వివాదాస్పద భూమిలో ఆయన కబ్జా పెట్టినట్లు తేలింది. అలాగే.. మాదాపూర్‌లోని 20 ఎకరాల భూమిని వసంత గ్రూప్ రియల్ ఎస్టేట్ సంస్థ కబ్జా చేసినట్లు హైడ్రా గుర్తించింది. ఈ వ్యవహారంపై ఆయన అధికారికంగా స్పందించాల్సి ఉంది.

# విశ్వమూ భ్రమిస్తోంది

## అతి నెమ్మదిగా తిరుగుతోంది
## 50 వేల కోట్ల ఏళ్లు పడుతుందట




భ్రమణం జీవలక్షణం. భూమి తన చుట్టూ తాను తిరుగుతుంది గనుకే రాత్రింబవళ్లు ఏర్పడతాయి. జీవకోటి యాత్ర సజావుగా సాగుతుంది. ఆ మాటకొస్తే చంద్రుని వంటి ఉపగ్రహాలు మొదలుకుని గ్రహాలన్నీ తమ చుట్టూ తాము నిత్యం తిరుగుతూనే ఉంటాయన్నది తెలిసిందే. చివరికి సూర్యుడు కూడా ఇందుకు అతీతుడు కాదు. ఆ మాటకొస్తే పాలపుంత కూడా తనచుట్టూ తాను తిరుగుతూ ఒటుంది. మరి విశ్వం? విశ్వానికి భ్రమణమనేది లేదన్నది ఇప్పటిదాకా నమ్ముతూ వచ్చిన సిద్ధాంతం. అది నిత్యమూ అన్ని దిశలకూ సమానంగా విస్తరిస్తూ ఉంటుందన్నది సైంటిస్టుల భావన. కనుక విశ్వం తనచుట్టూ తాను తిరగదని సూత్రీకరించారు. కానీ అది నిజం కాదంటోంది తాజా పరిశోధన ఒకటి. విశ్వం కూడా తనచుట్టూ తాను తిరుగుతుందని పేర్కొంది. అయితే అది అత్యంత నెమ్మదిగా జరుగుతోందట. ఎంత మెల్లిగా అంటే, విశ్వం ఒక భ్రమణం పూర్తి చేయడానికి ఏకంగా 50 వేల కోట్ల ఏళ్లుపడుతుందని ఆ పరిశోధన తేల్చింది! దాని అధ్యయన వివరాలను రాయల్ ఆస్ట్రనామికల్ సొసైటీ జర్నల్‌లో ప్రచురించారు.

### 'హబుల్'ముడి వీడినట్టే!


తాజా పరిశోధనకు హవాయి యూనివర్సిటీలోని ఆస్ట్రానమీ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ప్రొఫెసర్ ఇస్ట్‌వాన్ జపుదీ సారథ్యం వహించారు. అంతరిక్ష శాస్త్రానికి సంబంధించి ఇప్పటిదాకా అతి పెద్ద ప్రహేళికల్లో ఒకటిగా మిగిలిపోయిన 'హబుల్ టెన్షన్'ను పరిష్కరించేందుకు కూడా ఇది దోహదపడుతుందని సైంటిస్టులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే విశ్వం తనచుట్టూ తాను తిరగడం లేదంటూ ఇప్పటిదాకా విశ్వసిస్తూ రావడం తెలిసిందే. విశ్వ విస్తరణ వేగానికి సంబంధించిన రెండు పరస్పర విరుద్ధ సమీకరణాలను వివరించడంలో ఈ సిద్ధాంతం విఫలమవుతోంది. వాటిలో ఒకటి సుదూరాల్లోని సూపర్‌నోవాలు, నక్షత్ర మండలాల దూరాల ఆధారంగా రూపొందించినది. మరొకటి దాదాపు 1,300 ఏళ్ల కింద విశ్వం ఆవిర్భవించిన నాటి కాస్మిక్ రేడియేషన్ నేపథ్యం ఆధారంగా సూత్రీకరించినది. రెండింట్లో ప్రతిపాదించిన విశ్వ విస్తరణ రేటులో తేడా ఉంది. దీన్ని అంతరిక్ష శాస్త్ర పరిభాషలో 'హబుల్ టెన్షన్'గా పిలుస్తారు. జపుదీ బృందం అభివృద్ధి చేసిన గణిత సిద్ధాంతం ఈ సమస్యకు పరిష్కారం చూపడం విశేషం! అందులో భాగంగా విశ్వ విస్తరణ సిద్ధాంతానికి కొద్దిపాటి భ్రమణ సూత్రాన్ని జోడించారు. తద్వారా రెండు సమీకరణాలూ సరైనవేనని తేలినట్టు సైంటిస్టులు వివరించారు. "ప్రతిదీ విధిగా తనచుట్టూ తాను తిరుగుతుందన్న గ్రీకు తత్వవేత్త హెరాక్లిటస్ సూత్రాన్ని నమ్మి రంగంలోకి దిగాం. ఇంతవరకూ వచ్చాం. విశ్వం ఒక భ్రమణానికి 500 బిలియన్ ఏళ్లు తీసుకుంటుందన్న మా సూత్రీకరణ చాలా హేతుబద్ధంగా ఉంది. పైగా ప్రస్తుత భౌతికశాస్త్ర సూత్రాలు వేటినీ ఉల్లంఘించడం లేదు. కనుక రెట్టించిన ఉత్సాహంతో తర్వాతి దశకు పరిశోధనకు సిద్ధమవుతున్నాం. విశ్వభ్రమణ సిద్ధాంతాన్ని మరింతగా పరిశోధించేందుకు సమగ్ర కంప్యూటర్ సిమ్యులేషన్ ప్రయోగాలు చేపట్టనున్నాం"అని జపుదీ వివరించారు. ఈ సిద్ధాంతం పూర్తిస్థాయిలో నిరూపణ అయితే విశ్వం తాలూకు మన అవగాహన మరింత విస్తరిస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు.

# కత్తులతోనే పొత్తు పొడుపు!




అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఏడాది వ్యవధి ఉండగానే తమిళనాడులో ప్రత్యర్థి పార్టీల మధ్య చిట పటలు మొదలైపోయాయి. ఈసారి ఎలాగైనా నిలదొక్కుకుని పార్టీ జెండా రెపరెపలాడించాలని బీజేపీ కృతనిశ్చయంతో ఉన్నట్టు కనబడుతోంది. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌పై విమర్శల జోరుపెంచారు. స్టాలిన్ కూడా అంతే దీటుగా బదులిస్తున్నారు. రెండేళ్ల క్రితం తమను వీడివెళ్లిన అన్నా డీఎంకేతో బీజేపీ చెలిమిని ఖరారు చేసుకుంది. అందుకోసం అమిత్ షా చెన్నై రావటాన్ని చూస్తే రాబోయే పోరులో తమది కీలకమైన పాత్రని ఆ పార్టీ చెప్పదల్చుకున్నట్టు అర్థమవుతుంది. అయితే ఈ సాన్నిహిత్యం ఏమంత సజావుగా లేదని జరుగుతున్న పరిణామాలు చెబుతున్నాయి. కేవలం ఈ చెలిమి కోసం బీజేపీ అన్నామలైని రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించి ఆ స్థానంలో నయనార్ నాగేంద్రన్‌ను నియ మించింది. అన్నామలై గత రెండేళ్లుగా డీఎంకే సర్కారుపైకి దూకుడుగా పోతున్నారు. నిరుడు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి ఆధిపత్య కులాల వోట్లు రాబట్టడంలో, యువతను సమీకరించటంలో ఆయన విజయం సాధించారు. సీట్లయితే రాలేదుగానీ... బీజేపీ వోటు శాతం 11.24 శాతా నికి చేరుకుంది. కానీ ఆ దూకుడు పొత్తు రాజకీయాల్లో చిచ్చు పెడుతుందన్న భయం బీజేపీ అధిష్ఠా నంలో వుంది. ఎందుకంటే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం పళనిస్వామిపై అన్నామలై తీవ్ర విమర్శలు చేశారు. అవి వ్యక్తిగత స్థాయికి వెళ్లి పోయాయి. అందుకే ఎన్నికల వరకూ పొత్తు సజావుగా వుండాలంటే అన్నామలైని తప్పించటమే మంచిదని కేంద్ర నాయకత్వం భావించింది. నాగేంద్రన్ అన్నాడీఎంకే నుంచి వచ్చినవారే. జయ సర్కారులో పళని స్వామి, ఆయనా సహచరులు కూడా. 2016లో జయ మరణం తర్వాత నాగేంద్రన్ బీజేపీ కండువా కప్పుకున్నారు. ఆ మాటెలావున్నా రెండు పార్టీలకూ ఇది ఇష్టం లేని పొత్తే. కొన్ని సీట్లయినా సాధించుకోగలిగితే ద్రవిడ కోటలో పాగా వేశామన్న అభిప్రాయం కలిగించ వచ్చని బీజేపీ ఆశిస్తోంది. అటు అన్నాడీఎంకే పరిస్థితీ ఏమంత బాగోలేదు. జయ మరణంతో అది అనాథగా మారింది. అంత ర్గత కీచులాటల మధ్య 2021 వరకూ ప్రభుత్వం మనుగడ సాగించినా తర్వాత అది మూడు ముక్క లైంది. పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకేకు అసెంబ్లీ ఎన్నికల్లో 66 స్థానాలొచ్చాయి. కానీ గత లోక్‌సభ ఎన్నికల్లో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. మొత్తం 39 స్థానాలనూ డీఎంకే కూటమి గెల్చుకుంది. అందుకే అటు బీజేపీకి, ఇటు అన్నాడీఎంకేకు ప్రస్తుత పొత్తు ప్రాణావసరమైంది. సమస్యేమంటే రెండు పార్టీల మధ్యా పొత్తు ఏర్పడినా, అది ఎన్డీయే కూటమిగా ఉంటుందని అమిత్ షా చెప్పినా ఈ చెలిమితో ఇరుపక్షాలూ ఇబ్బంది పడుతున్న వైనం కనబడుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే లేకుండానే తాము 11.24 శాతం వోట్లు రాబట్టుకోగలిగామని బీజేపీ ధీమాగా వుంది. కానీ ఆ పరిస్థితి అన్నాడీఎంకేలో లేదు. అధికారంలో పాలుపంచుకుంటామో, లేదో ఎన్నికల తర్వాతే చెబుతామని షా అంటే... ఎన్నికల్లో పోటీవరకే పొత్తులని పళనిస్వామి ప్రక టించారు. తమిళనాడు రాజకీయ ధోరణులు గమనిస్తే అక్కడ కూటమి ప్రభుత్వాలు ఎప్పుడూ లేవు. పొత్తులున్నా రాష్ట్ర మంత్రివర్గంలో ఏనాడూ జాతీయ పార్టీలకు చోటీయలేదు. ఇప్పుడు కూడా అదే కొనసాగుతుందనుకుంటే తప్ప తమిళ వోటర్లు కనికరించరని పళనిస్వామి, అమిత్ షాలు అనుకుని వుండొచ్చు. అయితే డీఎంకేపై విరుచుకుపడటానికి తగిన ఆయుధాలు లేకపోవటం ఎన్డీయే కూటమికున్న ప్రధాన సమస్య. కాశీకి ప్రత్యేక రైలు నడపటం, కొత్త పార్లమెంట్ భవనంలో సెంగోల్, వీణ పెట్టడం ద్రవిడ రాజకీయ ప్రాబల్యంగల తమిళనాడును అంతగా ఆకర్షించినట్టు లేదు. స్టాలిన్ అమ్ములపొదిలో చాలా అస్త్రాలున్నాయి. ముఖ్యంగా ఆయన తమిళుల ఆత్మగౌరవంఅంశాన్ని ముందుకు తెచ్చారు. తమిళులు అనాగరికులని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యా నించటం, అనంతరం క్షమాపణ చెప్పటం ప్రస్తావిస్తున్నారు. బలవంతంగా హిందీ రుద్దాలని చూస్తు న్నారని ఆరోపిస్తున్నారు. ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి సీఎం నవీన్ పట్నాయక్‌కు సన్నిహి తుడైన తమిళ ఐఏఎస్ అధికారి వీకే పాండ్యన్‌పై బీజేపీ రేపిన దుమారాన్ని గుర్తుచేస్తున్నారు. ఒడిశా ప్రజలపై తమిళులు పెత్తనం ఎలా చేస్తారని ప్రశ్నించటాన్ని ఎత్తిచూపుతున్నారు. గత పదేళ్లలో తమిళ నాడుకు కేంద్ర నిధులు మూడు రెట్లు పెరిగినా కొందరికి ఏడవటం అలవాటైపోయిందన్న ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలనూ ఆయన తనకు అనుకూలంగా మలుచుకున్నారు. తమ వంతు వాటా అడగటం తమ హక్కని, అందుకు ఏడవటం లేదా బానిసత్వం చేయటం చేతకాదని స్టాలిన్ జవాబి చ్చారు. 234 స్థానాలుగల అసెంబ్లీలో గత ఎన్నికల్లో డీఎంకే సొంతంగా 133, మిత్రులతో కలిసి 159 గెల్చుకుంది. 46 శాతం వోట్లు రాబట్టింది. ఇప్పటికైతే తమిళనాట సామాజిక న్యాయం, రాష్ట్రాల హక్కులు, ఆత్మగౌరవం ప్రధానాంశాలు. గవర్నర్ ఆర్ఎన్ రవి అసెంబ్లీ ఆమోదించిన పది బిల్లుల్ని దీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచటం, సుప్రీంకోర్టు ఆయన్ను మందలించటంతోపాటు వాటిని ఆమోదించినట్టుగా భావించాలని చెప్పటం స్టాలిన్‌కు మరింత శక్తినిచ్చింది. అవినీతి పెరిగిందని, వేలకోట్ల ప్రజాధనాన్ని డీఎంకే నేతలు దోచు కుంటున్నారని, శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని బీజేపీ చేస్తున్న ఆరోపణలు ప్రజల్ని ఎంతవరకూ కదలించగలవో చూడాలి. అంతకన్నా ముందు అసెంబ్లీ ఎన్నికలు జరిగే వచ్చే ఏప్రిల్‌నాటికైనా తమ పొత్తు విషయంలో ఆత్మవిశ్వాసాన్ని కనబర్చటం అవసరమని ఎన్డీయే గుర్తించాలి.

# శాంతి చర్చలకు మేధావులే బాట వేయాలి



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతి చర్చలకు బేషరతుగా సిద్ధంగా ఉన్నామని మావోయిస్టు పార్టీ 2 ఏప్రిల్ 2025 పత్రికా ప్రకటన ద్వారా తెలియచేసింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత మావోయిస్టు పార్టీ తిరిగి శాంతి చర్చలకు ప్రతిపాదించింది. ఇప్పటికీ బలంగా ఉన్న చత్తీస్‌గఢ్, జార?ండ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో గత రెండు మూడేళ్ళుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన నక్సల్స్ ఏరివేత కార్యక్రమంలో వందల సంఖ్యలో తీవ్రవాదులు, సానుభూతిపరులు మరణిస్తున్న నేపథ్యంలో తప్పని పరిస్థితుల్లో ఈ చర్చలకు మావోయిస్టు పార్టీ తెరలేపిందని భావిస్తున్నారు.దచర్చల ప్రతిపాదనలు పంపిన మావోయిస్టు పార్టీ. చత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, కేంద్ర ప్రభుత్వంతో చర్చలకు, పౌరహక్కుల సంఘాల నేతలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు కృషి చేయాలని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కోరింది. ఈ ప్రకటన నేపథ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి పీపుల్స్‌వార్, జనశక్తి పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఇరవై ఏళ్ల క్రితం జరిగిన చారిత్రాత్మక శాంతి చర్చల ప్రస్థానాన్ని మరోసారి సింహావలోకనం చేసుకోవాలి. విప్లవ ఉద్యమాల చరిత్రలో అత్యంత కీలక పరిణామంగా భావించే చారిత్రిక చర్చల ప్రక్రియ జరిగి దాదాపు 20 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ ఇరవై సంవత్సరాల అనంతరం దేశంలో ముఖ్యంగా ఉమ్మడి తెలుగురాష్ట్రాల్లో మావోయిస్టుల ప్రభావం తగ్గిందా లేక పోలీస్ యంత్రాంగానిదే పైచేయి అయిందా అనే దానికి పలు విశ్లేషణలు జరిగాయి, జరుగుతూనే ఉన్నాయి. 2004 అక్టోబర్ 15, 16, 17 తేదీల్లో అప్పటి పీపుల్స్‌వార్, జనశక్తి తీవ్రవాదులకు వైఎస్ఆర్ సిఎంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల సమయంలోనే బీహార్‌లోని ఎంసిసి, ఆంధ్రప్రదేశ్‌లోని పీపుల్స్‌వార్‌లు విలీనమై మావోయిస్టు పార్టీగా అవతరించింది. అయితే, అప్పుడు పేరుకు ముఖ్యమంత్రి వైఎస్ఆర్ ఉన్నప్పటికీ ఈ చర్చలకు పీపుల్స్‌వార్‌ను ఒప్పించడంలో అప్పటి హోంశాఖ మంత్రి కుందూరు జానారెడ్డికే క్రెడిట్ దక్కుతుంది. ఈ చర్చల విషయంలో తటస్థులుగా భావించే ఎస్ఆర్ శంకరన్, పొత్తూరి వెంకటేశ్వర్ రావు, కన్నబీరన్‌లు కూడా కీలక పాత్ర వహించారు. చర్చల ఎజెండా, చర్చలకు వచ్చే పీపుల్స్‌వార్ ప్రతినిధులకు ప్రభుత్వం తరఫున కల్పించే భద్రత, చర్చల ఎజెండా, చర్చలలో ప్రభుత్వ ప్రతినిధులు, తీవ్రవాద పార్టీల ప్రతినిధులు, పౌరస్పందన వేదిక లాంటి తటస్థ ప్రతినిధులు కీలకపాత్ర వహించారు. చర్చల ప్రక్రియ సందర్భంగా మొదటి నుండి చివరి వరకు జరిగిన సంచలన పరిణామాలు, ఎన్నో ఆసక్తికరమైన అంశాలు, అంతర్గత విషయాలు, ఒకరిపై ఒకరు పైచేయి సాధించేందుకై చేసిన ఎత్తులు, పైఎత్తులు, చర్చలు విఫలమవడానికి దారితీసిన పరిస్థితులు ఇలా ఎన్నో అంతర్గత, ఆసక్తికరమైన సంచలన విషయాలను అప్పటి స్థానిక పత్రికలతో పాటు జాతీయ, అంతర్జాతీయ పత్రికలూ, వార్తా చానెళ్లు ప్రచురించాయి, ప్రసారం చేశాయి. ఈ చర్చలను ప్రస్తావిస్తూ ఇప్పటికీ పలువురు తమ వ్యాసాల ద్వారా తెలియచేస్తున్నారు. ఈ చర్చల ప్రక్రియలో ఎవరిది పైచేయి అయిందనేది పక్కకు పెడితే, పీపుల్స్‌వార్, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య జరిగిన చర్చలు అనేవి చారిత్రాత్మకమే అని చెప్పవచ్చు. అప్పటి చర్చల్లో ప్రధాన ఎజెండాగా ఉన్న పోడు భూములపై గిరిజనులకు హక్కు కల్పించాలనేది ప్రధాన డిమాండ్‌గా ఉంది. ఈ చర్చలకు ముందుగా ప్రభుత్వం నియమించిన అధికార పక్షం కమిటీ, మధ్యవర్తుల కమిటీ, తీవ్రవాద పక్షాల అనుకూల కమిటీ, వివిధ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాజకీయ పార్టీలు, భిన్నవర్గాలు, ధ్రువాలకు చెందిన వారితో ఎడతెగని చర్చలు నిర్వహించడం, వారి అభిప్రాయాలను మంత్రి ఎంతో ఓపికతో వినడం జరిగేది. ఈ క్రమంలో ఎంతో మంది ప్రముఖులను హోం మంత్రితో కలవడం జరిగేది. ఈ శాంతి చర్చలు కొనసాగడానికి అప్పటి హోం మంత్రి కుందూరు జానారెడ్డి కీలక పాత్ర వహించినప్పటికీ, పీస్ కమిటీ లేదా తటస్థుల కమిటీ సభ్యులుగా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్, ప్రొ. హరగోపాల్, స్వర్గీయ పొత్తూరి వెంకటేశ్వర్ రావు తోపాటు తటస్థులుగా భావించే మరికొందరు అత్యంత క్రియాశీలపాత్ర వహించారు. ముఖ్యంగా పీపుల్స్‌వార్, జనశక్తి పార్టీలకు ఈ చర్చల పట్ల ప్రభుత్వానికి మధ్య ఒక అంగీకార వాతావరణం ఏర్పరిచారు. సరే, ఈ చర్చల వల్ల ఎవరిది పైచేయి అయిందనేది పక్కకు పెడితే, ఆదివాసులకు అటవీ హక్కుల చట్టం (ఆర్ఓఎఫ్ఆర్) చేయడంలో ప్రముఖ పాత్రపోషించింది. ముఖ్యంగా అప్పటి శాంతి చర్చల్లో తటస్థుల కమిటీ, ప్రభుత్వ ప్రతినిధుల కమిటీ, పీపుల్స్‌వార్, జనశక్తి ప్రతినిధుల కమిటీలు క్రియాశీల పాత్ర వహించాయి. 2004 అక్టోబర్ 15, 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లోని మానవ వనరుల సంస్థ (ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి ఇన్‌స్టిట్యూషన్) లో జరిగిన ఈ శాంతి చర్చలపై ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి కలిగింది. దీనికి నిదర్శనం, ఈ చర్చల వివరాలను కవరేజీ చేయడానికి వచ్చిన జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలే ఉదాహరణ. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో ఈ చర్చలపట్ల చొరవ చూపేందుకు అప్పటి హోం మంత్రి జానారెడ్డి మాదిరిగా నిస్వార్థ, నిష్కల్మష నాయకుడి అవసరం కేంద్ర ప్రభుత్వానికి అవసరం ఉంది. జానారెడ్డికి అప్పటి మంత్రి వర్గ సహచరులైన ధర్మాన ప్రసాదరావు, కోనేరు రంగారావు, డిఎస్. రెడ్యానాయక్‌లతో పాటు కేశవరావు, పాలడుగు వెంకట రావు, మర్రి శశిధర్ రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి పూర్తి స్థాయిలో సహకరించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూడా వీరికి పూర్తి స్వేచ్ఛ నిచ్చారు. వీరితోపాటు అటు మావోయిస్టులు, ఇటు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేసే తటస్థుల అవసరం కూడా ఉంది. దీనికి, దేశంలోని మేధావివర్గం తమకుతాముగా ఈ చర్చల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడానికి చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే, ఇటీవల హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశమైన కొందరు తటస్థ ప్రముఖులు ఒక కమిటీగా ఏర్పడి ప్రభుత్వ, నక్సలైట్ పార్టీల మధ్య చర్చలు జరపడానికి తాము చొరవ చూపుతామని ప్రకటించారు. అయితే, గతంలో రాష్ట్రస్థాయిలో చర్చలు జరిగాయి. ప్రస్తుతం దీనికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాల్సి ఉంది. ఇది సాధ్యమయితే ప్రస్తుత వామపక్ష తీవ్రవాద రాష్ట్రాల్లో శాంతీయుత పరిస్థితులు ఏర్పడి ఆయా రాష్ట్రాలు అభివృద్ధి బాటలో పయనించడానికి మార్గం సుగమవుతుంది. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్రతిపాదిత ఏకపక్ష శాంతి చర్చలకు మావోయిస్టు పార్టీ నుండి కూడా గతంలో హైదరాబాద్‌లో ఉన్న గద్దర్, కల్యాణరావు, వరవరరావు లాంటి ప్రతినిధులు కూడా అవసరం ఉంది.

## ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణ అభివృద్ధి: సిఎం




టోక్యో: జపాన్ తెలుగు సమాఖ్య కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగంలో సాధించాల్సిన ప్రగతి సాధించామని అన్నారు. రాష్ట్రంలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. టోక్యోలో అభివృద్ధి చేసిన రివర్ ఫ్రంట్‌ని పరిశీలించామని అన్న రేవంత్ మూసీ ప్రక్షాళనకు కొంతమంది అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీని చూసి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి కీలకమని సిఎం పేర్కొన్నారు. తెలంగాణకు పెట్టుబడులు రావాలి.. పరిశ్రమలు పెరగాలి అని అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచాలనేదే ప్రభుత్వ ఉద్దేశం అని తెలిపారు. 'తెలంగాణ అభివృద్ధిలో అందరి సహకారం అవసరమని అన్నారు. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం మీకు తెలుసు' అని జపాన్‌లో స్థిరపడ్డ తెలుగువారిని ఉద్దేశించి సిఎం ప్రసంగించారు.

## మీరు కొత్త చట్టం కనిపెట్టారు.. హైకోర్టుపై సుప్రీంకోర్టు సీరియస్



న్యూఢిల్లీ: శిక్షా కాలం సగం ముగిశాక శిక్ష రద్దుపై నిర్ణయం తీసుకుంటామంటూ మధ్యప్రదేశ్ హైకోర్టు ఓ వ్యక్తి పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను పెండింగ్‌లో పెట్టడంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఎటువంటి ప్రాతిపదిక లేని కొత్త చట్టాన్ని హైకోర్టు కనిపెట్టడం మాకు ఆశ్చర్యం కలిగించింది' అని వ్యాఖ్యానించిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం పిటిషనర్‌కు బెయిల్ మంజూరు చేసింది. అయితే, భారీ సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నందున తీర్పును సవాల్ చేస్తూ వేసే అప్పీల్‌పై సమీప భవిష్యత్తులో వాదనలు వినే అవకాశాలు లేవు కాబట్టి బెయిల్ ఇవ్వవచ్చని ఈనెల 17న వెలువరించిన తీర్పులో స్పష్టం చేసింది. చట్టాలను యథాతథంగా అమలు చేయాలని, బెయిల్ కోసం పిటిషనర్లు తమ దాకా వచ్చేలా చేయరాదని పేర్కొంది. కాగా, హైకోర్టు ఏం చెప్పిందంటే.. 'తన వద్ద పట్టుబడిన నకిలీ నోట్ల గురించి పిటిషనర్ ఎటువంటి వివరణ ఇవ్వలేదు. అందుకే, శిక్ష నిలిపివేత, బెయిల్ మంజూరుకు తగు ప్రాతిపదిక లేదు. మొదటి దరఖాస్తును తిరస్కరించిన రెండు నెలల లోపలే బెయిల్ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకున్నాడు. అందుకే, సగం శిక్షా కాలం పూర్తయ్యాక మరోసారి బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు' అని పేర్కొంది. సాధారణ చట్ట ఉల్లంఘనలకు సంబంధించిన కేసుల్లో నిందితులకు బెయిల్ తిరస్కరించ వద్దని గతంలో ట్రయల్ కోర్టును, హైకోర్టులను కూడా సుప్రీంకోర్టు పలుమార్లు స్పష్టం చేసిందని ధర్మాసనం గుర్తు చేసింది.

## అధికారంలో ఉన్నప్పుడు విజయసాయే చక్రం తిప్పింది



విజయవాడ, : లిక్కర్ కేసు విచారణ సందర్భంగా రాజ్యసభ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వైఎస్సార్‌సీపీ కోటరీ వ్యాఖ్యలకు స్ట్రాంగ్ కౌంటర్ పడింది. అసలు అలాంటి కోటరీ ఒకటి ఉందో లేదో ఆయనకే తెలియాలి అంటూ వైఎస్సార్‌సీపీ రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి విజయసాయికి చురకలు అంటించారు. శనివారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "విజయసాయిరెడ్డి పార్టీ నుంచి వెళ్లిపోయాక ఏదోరకంగా అభియోగాలు మోపాలని చూస్తున్నారు. ఆయన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదు. పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఆయనే కదా ప్రధానంగా చక్రం తిప్పింది. అలాంటప్పుడు పార్టీలో కోటరీ ఉందో? లేదో?.. కోటరీ నడిపిందెవరో ఆయనకు తెలియదా?. ఇప్పుడేమో నెంబర్ 2 నుంచి 2 వేల స్థానానికి పడిపోయానని ఆయనే చెప్పుకుంటున్నాడు. మేం అధికారంలో ఉన్నప్పుడు మా అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకులతో, అధికారులతో చర్చించాకే నిర్ణయాలు తీసుకునేవారు. మా పార్టీలో నెంబర్ 2 స్థానం అనేది ఎప్పుడూ లేదు.. రాబోయే రోజుల్లో కూడా ఉండదు. మా పార్టీలో నెంబర్ వన్ నుంచి 100 వరకూ అన్నీ జగన్ మోహన్ రెడ్డే" అని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. "మా హయాంలో ఎలాంటి స్కాములు జరగలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారు. లిక్కర్ స్కామ్ అంటూ భూతద్దంలో పెట్టి చూస్తున్నారు. భయపెట్టి కొంతమందిని లొంగదీసుకునే కార్యక్రమం చేస్తున్నారు. అన్నింటి పైనా న్యాయపోరాటం చేస్తాం" అని వైవీ సుబ్బారెడ్డి అన్నారు.

## చిన్నారి కథ విని హరీశ్‌రావు కంటతడి..




సిద్ధిపేట: ఓ చిన్నారి కథ విని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు భావోద్వేగానికి గురయ్యారు. సిద్ధిపేటలో విద్యార్థుల కోసం లీడ్ ఇండియా ఆధ్వర్యంలో 'భద్రంగా ఉండాలి.. భవిష్యత్‌లో ఎదగాలి' అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓ చిన్నారి మాటలకు ఆయన చలించిపోయారు.. కంటతడి పెట్టారు. ఆ విద్యార్థిని మాట్లాడుతూ తన తండ్రి చిన్నప్పుడే చనిపోయాడని.. తల్లే తనను కష్టపడి చదివిస్తోందని కన్నీళ్లు పెట్టుకుంది. ఆ చిన్నారి మాటలు విన్న హరీశ్‌రావుతో పాటు ఆ వేదికపై ఉన్న వారంతా ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. ఆ బాలికను ఆత్మీయంగా దగ్గరికి తీసుకున్న హరీశ్‌రావు.. వేదికపై తన పక్కన కూర్చోబెట్టుకుని ఓదార్చారు.

# ఉష్ణప్రణాళికలో తెలంగాణ చొరవ




ఏటా వేసవికాలం భారత వాతావరణ శాఖ వేడిగాలులు, వేడితరంగాల గురించి హెచ్చరించడం పరిపాటి. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ హెచ్చరికలు ప్రారంభమయ్యాయి. ఈశాన్య, పశ్చిమ భారతంలోని కొన్ని ప్రాంతాల్లో వేసవి ప్రారంభానికి ముందే సాధారణం కంటే 3.1 5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక తూర్పు, దక్షిణ భారతదేశంలో రాబోయే రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు, వేడితరంగాల వాడి బాగా పెరుగుతుందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. అయితే ఈ ప్రమాదాన్ని ఎదుర్కోడానికి భారతదేశం ఎంతవరకు సంసిద్ధమవుతుందన్నది ప్రశ్నార్థకం. అయితే దేశం లోని మిగతా రాష్ట్రాల సంగతి ఎలా ఉన్నా తెలంగాణ మాత్రం వడగాడ్పుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడానికి సంసిద్ధం కావడం హర్షించదగిన పరిణామం. వడదెబ్బతో మృతి చెందిన కుటుంబాలకు రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని నిర్ణయించింది. ఇదివరకు వడదెబ్బతో మృతి చెందిన కుటుంబాలకు కేవలం రూ. 50 వేలు మాత్రమే చెల్లించేవారు. వడగాలులను రాష్ట్ర విపత్తుగా గుర్తించి ఆ మేరకు సహాయాన్ని అందించడంతోపాటు ఎక్స్‌గ్రేషియాను రూ. 4 లక్షలకు పెంచుతున్నట్టు రాష్ట్రప్రభుత్వం ప్రకటించడం ఎంతైనా ముదావహం. గత ఏడాది వేసవిలో 28 జిల్లాల్లో వడగాలులు వీచాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రప్రభుత్వం జిల్లా స్థాయినుంచి స్థానిక స్థాయివరకు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తోంది. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. విపత్తు నిర్వహణ బడ్జెట్ నుంచి 10 శాతం నిధులను ఖర్చు చేయాలని సూచించింది. ఒకవేళ ఎవరైనా రైతు మృతి చెందితే వారి కుటుంబాలకు రైతు బీమా స్కీమ్ లేదా ఎక్స్‌గ్రేషియా వీటిలో ఏది ఎక్కువ మొత్తం వస్తే ఆ స్కీమ్‌ను ఆయా కుటుంబీకులు ఎంచుకోవచ్చు. భారత వాతావరణ శాఖ అంచనా ప్రకారం గరిష్ట ఉష్ణోగ్రత మైదానాల్లో 40 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే ఎక్కువ ఉంటే వేడి తరంగంగా ప్రకటిస్తారు. అలాగే తీరప్రాంతంలో 37 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే ఎక్కువ ఉంటే, కొండల్లో 30 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే ఎక్కువ ఉంటే వేడితరంగంగా ప్రకటిస్తారు. దేశంలో 20202022 మధ్యకాలంలో వడదెబ్బ కారణంగా మరణాలు పెరిగాయి. 2020లో 530 మరణాలు సంభవించగా, 2022లో అది 730కి పెరిగింది. గత ఏడాది దేశం మొత్తం మీద 17 రాష్ట్రాల్లో వడదెబ్బకు 733 మరణాలు సంభవించగా, 40,000 కేసులు నమోదయ్యాయి. అయితే కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ లెక్కలను సగానికి సగం తగ్గించి చెబుతోంది. వేడితరంగాల వల్ల సంభవించిన నష్టాలను తేల్చడానికి ప్రస్తుతం ప్రామాణికమైన డేటా సేకరణ అంటూ ఏదీ లేదు. పిల్లలు, వయోవృద్ధులు, అవుట్ డోర్ కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఐఎండి హెచ్చరిస్తోంది. అవుట్ డోర్ కార్మికులు మాత్రం విపరీతంగా దెబ్బతింటున్నారు. వీరి పని గంటలు 20 శాతం వరకు తగ్గిపోతున్నాయి. ఇది ఆయా కుటుంబాల ఆదాయంపై తీవ్రప్రభావం చూపిస్తోంది. ఫలితంగా దేశ జిడిపిపై కూడా ప్రభావం చూపిస్తోంది. సుదీర్ఘ కాలంగా వేడి వాతావరణం కొనసాగడం వేతనాలు తగ్గిపోవడమే కాక, ఆరోగ్య సమస్యలు ఎదురై వైద్యచికిత్సలకు ఎక్కువగా ఖర్చు చేయవలసి వస్తోంది. ఆయా కుటుంబాలను పేదరికంలోకి నెట్టేస్తోంది. దేశంలోని కార్మిక శక్తిలో మూడొంతుల మంది ఆరుబయలు విపరీతమైన వేడికి గురవుతున్నారని ఢిల్లీకి చెందిన వాతావరణ మేధావుల సంస్థ అధ్యయనం వెల్లడించింది. 2030 నాటికి భారతదేశంలోని పనిదినాలు 5.8 శాతం తగ్గిపోతాయని, ఇది 3.4 కోట్ల పూర్తి పని కాల ఉద్యోగాలతో సమానమని ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ 2019 నివేదిక వెల్లడించినట్టు ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. దేశంలో మొట్టమొదటి ఉష్ణకార్యాచరణ ప్రణాళిక 1999లో ఒడిశాలో అమలు చేశారు. 2010లో ప్రాణాంతక వేడి వడగాడ్పులు వ్యాపించడంతో ఆ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని దక్షిణాసియాలో ప్రప్రథమ నగరస్థాయి ఉష్ణప్రణాళిక (హీట్ యాక్షన్ ప్లాన్)ను అహ్మదాబాద్ రూపొందించింది. 2010 మే నెలలో అహ్మదాబాద్ పశ్చిమ భాగాన ఉష్ణోగ్రతలు 47.8 డిగ్రీల సెల్సియస్ దాటడంతో నవజాత శిశువులు 43 శాతం ఆస్పత్రి పాలు కావలసివచ్చింది. దేశం మొత్తం మీద అహ్మదాబాద్‌లో ఉష్ణకార్యాచరణ ప్రణాళికను తప్పనిసరిగా ఆనాడు అమలు చేయవలసి వచ్చింది. ఉత్పాదక రంగం పైన, ఆరోగ్యం పైన వ్యతిరేక ప్రభావాలను నివారించడమే ఈ ఉష్ణ ప్రణాళికల లక్ష్యం. అయితే 18 రాష్ట్రాలకు 37 ఉష్ణప్రణాళికలను ఢిల్లీకి చెందిన ఒక పరిశోధన సంస్థ విశ్లేషించగా, చాలా ప్రణాళికల్లో స్థానిక పరిస్థితులతో సంబంధం లేకపోవడం, నిర్వహణకు నిధుల కొరత స్పష్టంగా కనిపించింది. ప్రజల సమస్యలను, ఇబ్బందులను పరిష్కరించడంలో ఇవి విఫలమవుతున్నాయని తేలింది. ఇంధనం, విద్యుత్ సరఫరా, నీటి సరఫరా, ప్రజా రవాణా, విద్య, వ్యవసాయం, పశుసంవర్ధకం, తదితర ముఖ్యమైన రంగాల్లో అత్యధిక వేడి ప్రభావం ఎలా ఉంటుందో ఈ ప్రణాళికలు సమీక్షించలేకపోతున్నాయని తేలింది. ముఖ్యమైన సమస్య ఏమిటంటే ఈ ప్రణాళికల అమలుకు ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం ఉండడం లేదు. ఉష్ణ కార్యాచరణ ప్రణాళికలను చిత్తశుద్ధితో అమలు చేయలేకుంటే 2030 నాటికి దేశంలో 5.8 శాతం వరకు పని గంటలు తగ్గుతాయని, కార్మిక శక్తిలో దాదాపు 50 శాతం తమ పనుల్లో తీవ్రమైన వేడి వాతావరణాన్ని ఎదుర్కోవలసి వస్తుందని నివేదికలు హెచ్చరిస్తున్నాయి.

# వీడీసీల అరాచక పర్వం



నిజాం కాలంలో సమాజం ఎలా ఉండేదో వేరే చెప్పక్కర్లేదు. చరిత్ర తెలిసినవారందరికీ అవగతమే. రాజు ఏమడిగినా ప్రజలు కాదనకుండా ఇచ్చేవారు.కాపరులనిజాం కాలంలో సమాజం ఎలా ఉండేదో వేరే చెప్పక్కర్లేదు. చరిత్ర తెలిసినవారందరికీ అవగతమే. రాజు ఏమడిగినా ప్రజలు కాదనకుండా ఇచ్చేవారు.కాపరుల నుంచి గొర్రెల్ని, కుమ్మరుల నుంచి కుండల్ని, చేతివృత్తుల ద్వారా తయారు చేసిన అన్నింటిని ఉచితంగా పొందేవారు. లేదంటే కొరడా దెబ్బలు, శిక్షలు, రాజ్య బహిష్కరణలు ఉండేవి. ఇది అప్పటి రాచరిక దుర్మార్గం. కాలక్రమేణా రాజులు పోయారు, రాజ్యాలు పోయాయి. కానీ, వాటి మూలాలు మాత్రం మానవ సమాజాన్ని నేటికీ వేధిస్తూనే ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో అలాంటి భూస్వామ్య, పెత్తందారి విధానాల్ని అవలంభిస్తున్న విలేజ్ డెవలప్‌మెంట్ (వీడీసీ)ల ఆకృత్యాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. కుల బలం, ధనబలం, అధికారబలం అండతోనే ఇవి కొనసాగడం విచారకరం. ఇలాంటి ఆగడాల్ని అరికట్టాల్సిన పాలకులు చేష్టలూడిగి చూస్తుండటం మరీ బాధాకరం. జరిమానా కట్టలేదని తాళ్లరాంపూర్‌లో నలభై గౌడ కుటుంబాల్ని సాం ఘీక బహిష్కరణ చేయడం హేయం. స్పందించిన సీపీఐ(ఎం) బాధితులకు అండగా నిలబడింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టింది. పోలీసులు కేసు నమోదు చేసినా నిందితుల్ని మాత్రం ఇంకా అరెస్టు చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. గతంలో గ్రామాల్లో ఒకరికొకరు తోడుగా నిలబడేవారు. తర్వాత పరిస్థితులు మారాయి. గ్రామ అభివృద్ధి కమిటీలతో ఇంకా దిగజారాయి. పాలకుల అండతో వీడీసీలు చేస్తున్న ఆగడాలు మితి మీరాయి. గ్రామస్తుల్ని మానసికంగా వేధిస్తున్నాయి. ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో కొన్ని నెలలుగా గౌడ కుల స్తులకు వీడీసీ పెద్దలకు మధ్య వివాదం నడుస్తోంది. ఊరిలో తాటిచెట్లపై గీతకార్మికులకే హక్కుండాలి. అది వారి కుల వృత్తి, జీవనాధారం. అయితే అడిగిన సందర్భంలో తాటిచెట్టు ఎక్కి కల్లుపోయలేదనే నెపంతో ఏడాదికోసారి చెల్లించే టెండర్ డబ్బుల్ని రెట్టింపు చేసింది వీడీసీ. ఇది మాకు సాధ్యం కాదన్నా 'మేం చెప్పినట్టు వినకుంటే ఇలాంటి శిక్షలే ఉంటాయి' అని గ్రామాల్లో కొన్నింటిని ఉదహరించి మరీ వారిని బెదిరించారు. అంతటితో ఆగలేదు. గౌడ కులస్తులకు ఎవరు సహాయం చేసినా, మాట్లాడినా ఐదు వేల రూపాయల జరి మానా కూడా విధిస్తామని చాటింపు చేశారు. ఇది సహాయనిరాకరణగా సాగింది. వేధింపుల్ని తట్టుకోలేక కొంతమంది పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించినా ఫలితం లేదు! ఆర్మూర్ ప్రాంతంలోని మూడు నియోజక వర్గాలు, సుమారు రెండు వందల గ్రామాల్లో వీడీసీ చెప్పిందే వేదం, చేసిందే చట్టంగా నడుస్తోంది. ఈ కమిటీలో భూస్వాములు, పెత్తందారులే ఉంటారు. పండగైనా, పబ్బమైనా ప్రతీ కులం ఎంతోకొంత ముట్టచెప్పాల్సిందే! దీనికి లెక్కాపత్రం ఏమీ ఉండదు. లేదంటే బెదిరింపులు, జరిమానాలు, బహిష్కరణలు ఉంటాయి. నందిపేట్ మండలంలో గొర్రెలడితే ఇవ్వనందుకు గొల్లకుర్మలను గ్రామం నుంచి బహిష్కరించారు. మాక్లూర్ మండలంలో దళిత మహిళా సర్పంచ్ చేయి విరిచారు. సుబ్రియల్ గ్రామం నడిబొడ్డున అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టకూడదని రాద్ధాంతం చేశారు. పండగల సందర్భంగా దళితుల్ని గుళ్లలోకి కూడా రానివ్వడం లేదు. కోమన్‌పల్లి గ్రామంలో ప్రయివేటు భూమికి సంబంధించిన ఓ సర్వేలో నాయక్ పోడ్‌కులానికి చెందిన ఇద్దరు సాక్షి సంతకాలు పెట్టడంతో ఆగ్రహించిన వీడీసీ ఏకంగా యాభై మందిని ఊరినుంచి బహిష్కరించింది. కనీసం వీరికి హోటళ్లలో టీ కూడా ఇవ్వలేదు. జబ్బు చేస్తే ఆర్ఎంపీ వైద్యుడు కూడా రాలేదు. ఇలాంటి పెత్తందారి విషసంస్కృతి వీడీసీల పేరుతో గ్రామాల్ని చుట్టుముట్టడం ఆందోళన కలిగించే అంశం. చట్టాన్ని ఉల్లంఘించే ఈచర్యల పట్ల పోలీసులు కూడా కిమ్మనకపోవడం చూస్తే 'అధికారం' అండతోనే అనే వాదన కూడా వినిపిస్తోంది. భూస్వామ్య,పెత్తందారి వర్గాలు గ్రామాల్లో దుందుడుకు చర్యల్ని కొనసాగిస్తున్నాయి. అందుకు వీడీసీలనే ఉదాహ రణగా చెప్పొచ్చు. గ్రామాల్లోనున్న భూముల్ని ఆక్రమించు కోవడం, దళితుల్ని బెదిరించి తక్కువ ధరకు కొనుగోలు చేయడం, కిరణాషాపులు, బేకరీలు, వైన్స్, మార్కెట్, వడ్డీ వ్యాపారాలు వారి కిందే ఉంచుకోవడం వల్ల ఆధిపత్య వైఖరి 'చట్టబద్ధంగా' చెలామణి అవుతున్నది. రానురానూ అది ప్రజల్ని జలగల్లా పీలుస్తోంది. తమ మాట వినట్లేదనే అహంకార ధోరణి భూస్వామ్య విధానం నుంచి వచ్చినదే. ఇది దౌర్జన్యాలకు పాల్పడటం, అక్రమంగా సంపాదించడం, దోపిడీలకు తెగబడటాన్ని ప్రేరేపిస్తున్నది. సమాజంలో అన్ని కులాల్ని, మతాల్ని గౌరవించాలనే సంప్రదాయానికి పాతరేసింది. ఆ గౌరవం, మర్యాద ఇవ్వలేదనే, తమ మాటకు భంగం వాటిల్లిందనే తాళ్లరాంపూర్‌లో గౌడ కులస్తుల్ని బహిష్కరించింది. ఇది మూలం. మరి దీనికి విరుగుడు ఏంటి? ఇప్పుడు పౌర సమాజం ఆలోచించాలి.అధికార కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు వీడీసీల పట్ల తమ వైఖరి ఏమిటో తేల్చమని నిలదీయాలి.

# సమాఖ్య రక్షణ కోసం చారిత్రాత్మక తీర్పు



సుప్రీంకోర్టు దేశ సమాఖ్య సూత్రాలను పరిరక్షించే విధంగా నిజమైన ఒక చారిత్రాత్మక తీర్పునిచ్చింది. రాష్ట్ర శాసనసభ సంకల్పాన్ని వమ్ము చేసే విధంగా ఒక గవర్నర్ తీసుకునే చర్య ఏదైనా రాజ్యాంగ విరుద్ధమని ప్రకటిం చింది. న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పర్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ లతో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం వెలువరించిన 414 పేజీల తీర్పు చాలా ధైర్యవంతమైంది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన బిల్లులను తొక్కిపట్టిన గవర్నర్ ఆర్యన్ రవి రాజ్యాంగ పదవి దుర్వినియోగాన్ని తప్పు పట్టింది. 1994లో ఎస్.ఆర్.బొమ్మై కేసులో తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనం ఇచ్చిన మైలురాయి వంటి తీర్పుల తరహాలోకి చెందే తీర్పు ఇది. రాష్ట్ర ప్రభుత్వాలను తొలగించటం కోసం 356వ అధికరణాన్ని నిరంకుశంగా ఉపయో గించే పద్ధతికి ఆ తీర్పు స్వస్తి పలికింది. ఆ విషయంలో కూడా గవర్నర్ల నివేదికను సాకుగా తీసుకుని ఈ నిరంకుశ అధికరణాన్ని దుర్వినియోగ పరచటం జరుగుతుండేది. అప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం 356 అధికారంతో రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించడంగా మారింది.

### తొక్కిపట్టిన గవర్నర్

రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులకు అనుమతినివ్వకుండా నిరవధికంగా తొక్కిపడుతున్న గవర్నర్ చర్యకు వ్యతిరేకంగా తమిళనాడు ప్రభుత్వం ఈ కేసులో సుప్రీంకోర్టుకు వెళ్ళింది. రాజ్యాంగం 24వ అధికరణానికి అనుగుణంగా వ్యవహరించేందుకు గవర్నర్ నిరాకరించడంపై రాష్ట్ర ప్రభుత్వం రిట్ పిటిషన్ దాఖలు చేసింది. 200 అధికరణం ప్రకారం గవర్నర్‌కు మూడు అవకాశాలు (ఆప్షన్లు) ఉంటాయి. ఒకటి అసెంబ్లీ ఆమోదించిన బిల్లుపై ఆమోదముద్ర వేయటం. లేదా తన ప్రశ్నలతో, వ్యాఖ్యలతో బిల్లును సభకు తిప్పి పంపడం. కాదంటే ఈ బిల్లు రాజ్యా ంగ సూత్రాలను ఉల్లంఘిస్తుందని భావిస్తున్నట్లయితే రాష్ట్రపతి పరిశీలన కోసం పంపించటం అన్న మూడు పద్ధతుల్లో ఏదో ఒకటి అనుసరించాలి. ప్రస్తుతం ఈ కేసులోనే పది బిల్లులను తమిళనాడు శాసనసభ ఆమోదించి పంపగా గవర్నర్ ఆమోద ముద్ర వేయకుండా అట్టిపెట్టుకున్నారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం గవర్నర్‌కు బిల్లులను ఆమోదించటం తప్ప మరో అవకాశం ఏదీ లేదు. అలా చేసే బదులు గవర్నర్ ఈ బిల్లులు అన్నింటిని రాష్ట్రపతి పరిశీలనకు పంపించారు. గవర్నర్ అనుసరించిన ఈ పద్ధతి చర్య 'నిజాయితీతో కూడింది కాదని' కోర్టు తేల్చి చెప్పింది. చట్ట ప్రకారం ఆయన చర్య తప్పు అని తీర్పు చెప్పింది. కోర్టు ఇంకాస్త ముందుకు వెళ్లి ఈ పది బిల్లులకు ఆమోదంలో లభించినట్టే భావిం చాలని కూడా తీర్పులో ప్రకటించింది. రాజ్యాంగం 200 అధికరణంలోని వివిధ నిబంధనల ప్రకారం గవర్నర్ నిర్ణ యం తీసుకోవడానికి పాటించవలసిన కాల వ్యవధిని కూడా నిర్దేశించింది. ఒక బిల్లుకు ఆమోద ముద్ర వేయడం లేదా శాసన సభకు తిప్పి పంపడం అన్నది మూడు మాసాలలోగా జరగాలని కాలవ్యవధి ప్రకటించింది. అలా తిప్పి పంపిన బిల్లును గనుక శాసనసభ మళ్లీ ఆమోదించి గవర్నర్‌కు వెనక్కు పంపితే ఆమోద ముద్ర వేయవలసి ఉంటుంది. గవ ర్నర్ ఒక నిర్ణయం తీసుకునే విషయమై రాజ్యాంగంలోని అస్పష్టతను ఈ ఆదేశాల ద్వారా సుప్రీంకోర్టు భర్తీ చేసింది.

### పరిశీలన తంతుకూ పగ్గాలు

రాష్ట్రపతి పరిశీలన నిమిత్తం పంపే విషయమై కూడా కోర్టు సకాలంలో సాహసోపేతమైన ఆదేశం ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం రాజకీయ లక్ష్యాలు నెరవేర్చుకోవడానికి ఉపయోగించుకునే రాజ్యాంగ సాధనాల్లో ఒకటిగా ఇప్పుడు ఈ ప్రక్రియ ఉంటుంది. గవర్నర్లు బిల్లును రాష్ట్రపతి పరిశీలన కోసం పంపించడం, తర్వాత కేంద్రం హుకుంల ప్రకారం నడుచుకోవడం దాని చేతుల్లో ఒక పనిముట్టుగా మారింది.

### కేరళ పోరాటం

ఈ తీర్పు కేవలం తమిళనాడుకే కాకుండా అన్ని రాష్ట్రాలకు ఒక విజయం. కేరళ, కర్నాటక, పంజాబ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులకు ఆమోద ముద్ర వేయకుండా గవర్నర్లు తొక్కి పడుతున్నారు. కేరళ మాజీ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఇదేవిధంగా తొక్కి పట్టిన విషయమై ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా రిట్ పిటిషన్ వేసింది. ఏప్రిల్ 8న తమిళనాడు పిటిషన్‌పై తీర్పు రాగానే కేరళ ప్రభుత్వ న్యాయవాది తమ పిటిషన్ కూడా అదే ధర్మాసనం విచారించాలని కోరారు. అయితే రాష్ట్రపతి ఏ నిర్ణయం తీసుకోకుండా అట్టిపెట్టినందున కేరళ అభ్యర్థనను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆమోదించలేదు. దాన్ని మే 13న విచారణకు నిర్ణయించారు. కేరళ గవర్నర్ ఇదేవిధమైన చర్యలకు పాల్పడ్డారు. కనుక కేరళ పిటిషన్ కూడా ఇదే ధర్మాసనం విచారించి ఉంటే మరింత బాగుండేది.

### కేంద్రం బాధ్యత

కేంద్ర ప్రభుత్వం ఈ చారిత్రాత్మకమైన తీర్పుకు అనుగుణంగా కట్టుబడి వ్యవహరించాల్సి ఉంటుంది. గవర్నర్లు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించేలా పురికొల్పడం మానుకోవాలి. కేరళకు కొత్తగా వచ్చిన గవర్నర్ అప్పుడే సుప్రీంకోర్టు తీర్పును 'రాజ్యాంగ అతిక్రమణ'గా అభివర్ణించారు. ఈ విషయమై రాజ్యాంగ ధర్మాసనం వినాలనే కోర్కెలు కూడా వినిపిస్తున్నాయి. ఈ తీర్పును వమ్ము చేసేందుకు జరుగుతున్న అలాంటి ప్రయత్నాలన్నిటిని అడ్డు కోవాలి. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ విపరీత కేంద్రీకరణ దిశలో సాగుతున్న పోకడలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఇదొక మైలురాయి వంటి తీర్పు. రాజ్యాంగ సమాఖ్య సూత్రాలను కాపాడుకోవడానికి సకల ప్రయత్నాలు జరగాల్సిందే.